





అమరావతికి అందలం

అమరావతికి అందలం.. సంక్షేమానికి జవసత్వాలు.. వివిధ పథకాలకు పూర్వ వైభవం.. పడకేసిన సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం.. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం సోమవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతో పాటు ఆయా రంగాలపై బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇవ్వడంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతికి బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరగడంతో ఇక అభివృద్ధి పనులు పరుగులు తీయనున్నాయి. గత పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన సాగునీటి రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈ క్రమంలో కృష్ణా డెల్టా, పులిచింతలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. అదేవిధంగా భారీ వర్షాలతో తెగిపోయి రైతులను నిండా ముంచేస్తోన్న సాగునీటి కాల్వల బాగుకు కూడా నిధులు కేటాయింపులు జరిగాయి. ఇక విద్యా పరంగా స్కిల్ డెవలప్ మెంట్, విదేశీ విద్య కోసం గతంలో అమలు చేసిన అంబేడ్కర్ విదేశీ విద్యోన్నతి పథకం పునరుద్ధరణతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర బడ్జెట్లో భారీగా కేటాయింపులు

- సంక్షేమానికి జవసత్వాలు.. పథకాలకు పూర్వవైభవం
- రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులకు రూ.4 వేల కోట్లకు పైగా
- మెట్రో రైలుకు రూ.50 కోట్లు, హైకోర్టు భవనాలకి రూ.13.3 కోట్లు
- కృష్ణా డెల్టాకు రూ.138.76 కోట్లు.. భూసేకరణకు మరో రూ.50 కోట్లు
- పులిచింతల నిర్వహణకు రూ.29.45 కోట్లు.. గుండ్లకమ్మకు రూ.13 కోట్లు కేటాయింపు





గుంటూరు, బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా పడకేసిన రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు నీర్వీర్యమైన వివిధ రంగాలు, ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారించింది. సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఆయా అంశాలకు ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం మరో నాలుగు నెలల 20 రోజుల్లో ముగియనున్న దృష్ట్యా ఆ మేరకు ఆశాజనకంగానే కేటాయింపులు చేసింది. ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై బడ్జెట్లో ప్రస్తావనకు కూడా నోచుకోని అమరావతికి కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్లో అత్యంత ప్రాధాన్య అంశంగా కనిపించింది. రాజధాని నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. అమరావతి క్యాపిటల్ డెవలప్మెంట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా రూ.3 వేల కోట్లు కేటాయించింది. స్మార్ట్ సిటీల కార్యక్రమంలో భాగంగా అమరావతికి వేర్వేరుగా నిధుల కేటాయింపు జరిగింది. ఇందులో సీఐటీఐఐఎస్ చాలెంజ్ ప్రోగ్రామ్ కింద రూ.32 కోట్లు, మిషన్ డెవలప్‌మెంట్ స్మార్ట్‌సిటీలో అమరావతికి రూ.50 కోట్లు కేటాయించారు. ఏపీసీఆర్‌డీఏ సహాయ నిధి కింద బడ్జెట్‌లో రూ.1053.70 కోట్లు కేటాయించారు. ల్యాండ్ పూలింగ్ ఫర్ కేపిటల్ సిటీ కోసం రూ.400 కోట్లు కేటాయించారు. నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని నిర్ణయించిననాటి నుంచి మెట్రో రైలు ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలను ఊరిస్తూనే ఉంది. 2014- 19ల మధ్య ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ ప్రాజెక్టు 2019- 24 మధ్య వైసీపీ హయాంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. తాజా బడ్జెట్లో మెట్రో రైలు విభాగానికి రూ.50 కోట్లు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం రాజధాని పట్ల తన చిత్తశుద్ధిని ప్రకటించింది. దీంతోపాటు హైకోర్టు భవనాల నిర్మాణాల కోసం రూ.13.3 కోట్లు, ఏపీ సైన్స్ సిటీ కోసం రూ.2.6 కోట్లు కేటాయించింది. అమరావతికి బడ్జెట్ కేటాయింపులు జరిగిన సోమవారం రోజే రాజధాని అమరావతి మరో మైలురాయిని అధిగమించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి వస్తున్న నిధులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులతో సీఆర్డీఏ కమిషనర్ సంతకాలతో రుణ ఒప్పందం పూర్తయి నిధులు మంజూరవనున్నాయి. ఇక మంగళగిరిలోని ఎయిమ్స్‌లో నీటి సరఫరా కోసం రూ.5 కోట్లు కేటాయించారు.

సేతు బంధన్ కింద రూ.115.2 కోట్లు

కేంద్ర ప్రభుత్వ పథకమైన సేతబంధన్ కింద చేపట్టబోతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.115.2 కోట్లను చూపించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో ఆర్‌వోబీలు మంజూరైనప్పటికీ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరులోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విస్తరణకు వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బడ్జెట్‌లో సేతుబంధన్ కింద కేటాయించిన రూ.115.2 కోట్లలో సింహభాగం నిధులు శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

ఎన్జీ రంగా వర్సిటీకి.. రూ.507 కోట్లు


గుంటూరు సిటీ: గుంటూరు సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీకి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. వైసీపీ హయాంలో వర్సిటీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఇటీవల రంగా జయంతి కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు వర్సిటీకి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ.507 కోట్లు కేటాయించారు. ఈ నిధుల కేటాయింపుతో వర్సిటీకి ప్రభుత్వం జీవం పోసినట్లైంది. భూసార పరీక్షలకు పెద్ద పీట వేయడంతో పాటు, రైతులకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ కృతనిశ్చయం ఈ నిధుల కేటాయింపుతో నెరవేరుతుందని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. రైతులకు యంత్ర పరికరాలు, క్రమం తప్పకుండా భూసార పరీక్షలు, ఉద్యాన పంటలకు రాయితీలు, ఆక్వాసాగుకు ప్రోత్సాహకాలకు కూటమి ప్రభుత్వం సుముచిత ప్రాధాన్యం ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా యంత్ర పరికరాలకు దాదాపు రూ.11 కోట్లు, భూసార పరీక్షలకు రూ.3 కోట్ల వరకు కేటాయింపు ఉండొచ్చని తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌కు రూ.2.50 కోట్లు, ఉద్యాన పంటల రాయితీల కింద రూ.300 కోట్ల వరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. వడ్డీలేని రుణాలలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాటా రూ.45 కోట్ల వరకు , రైతు సేవా కేంద్రాలకు సంబంధించి రూ.3 కోట్ల వరకు నిధుల కేటాయింపు దక్కే అవకాశం ఉంది.



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం

పడకేసిన సాగునీటి ప్రాజెక్టుల పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం భారీగా నిధుల కేటాయించింది. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కృష్ణా పశ్చిమ డెల్టా కింద 5.50 లక్షల ఎకరాలు సాగవుతుండగా రూ.138.76 కోట్లు కేటాయించారు. డెల్టా కింద భూసేకరణ కోసం రూ.50 కోట్లను కేటాయించారు. ఇది గుంటూరు చానల్ పొడిగింపు ప్రాజెక్టు కోసమా.. గోదావరి - పెన్నా నదుల అనుసంధానం కోసమా అనేది తేలాల్సి ఉన్నది. డెల్టాలో పెండింగ్‌లో ఉన్న ఆధునికీకరణ పనుల పూర్తిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూ.37.53 కోట్లను కేటాయించింది. దీంతో ఆయా పనులు పూర్తి అవుతాయని అధికారవర్గాలు తెలిపాయి. పులిచింతల ప్రాజెక్టు నిర్వహణని కూడా గత ప్రభుత్వం మరిచింది. దాంతో ఒక దఫా భారీ వరద వచ్చినప్పుడు రేడియల్ క్రెస్టు గేటు కొట్టుకుపోయింది. దాని స్థానంలో స్టాప్‌లాక్ గేటు అమర్చేందుకు జలాశయంలోని నీటిని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఖాళీ చేయించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పులిచింతల ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.29.45 కోట్లను కేటాయించింది. దీని వలన నిర్వహణ పనులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవు. గత ప్రభుత్వ వైఫల్యంతో ఏకంగా గేట్లే కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.13 కోట్ల నిధుల కేటాయింపు జరిగింది. ప్రాజెక్టు ప్రకాశం జిల్లాలో పరిధిలో ఉన్నా బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గ ప్రజలకు సాగునీటి విషయంలో గుండ్లకమ్మ దోహదపడుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో కాల్వలు, వాగుల గట్లు తెగిపోయి పంటలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరద నియంత్రణ ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో రూ.19.55 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది.



ఎన్టీఆర్‌కు నివాళి..



ఆనవాయితీ ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు సోమవారం అసెంబ్లీ సమావేశాలకు వెళ్తూ వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన వెంట మంత్రులు నారాయణ, లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు విశాఖ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఉన్నారు. -తుళ్లూరు

గోతుల్లేని రోడ్ల కోసం..



గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రోడ్ల మరమ్మతుల కోసం దాదాపు వెయ్యి కోట్ల వరకు అవసరమవుతుందనే అంచనాలను రూపొందించారు. ప్రభుత్వం తాజాగా జరిపిన కేటాయింపుల్లో భాగంగా జిల్లాలకు ఇతోధికంగానే వాటా దక్కనున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కింద రూ.800 కోట్లు, ఆర్అండ్‌బీ కింద వెయ్యి కోట్ల వరకు నిధులు మూడు జిల్లాల పరిధిలో దక్కనున్నాయి.

సంక్షేమం.. నైపుణ్యం



నామినేటెడ్ పదవుల కోసమే అన్నట్లుగా వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటిని కుదేలు చేసిన ఘనత గత ప్రభుత్వానిది కాగా కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లు ఆయా వర్గాల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ఇతోధికంగా నిధులు కేటాయించింది. ఎస్సీ సంక్షేమం కింద దాదాపు రూ.600 కోట్లు, ఎస్టీ వెల్ఫేర్ కింద రూ.200 కోట్లు, బీసీ సంక్షేమం కింద దాదాపుగా రెండు వేల కోట్లవరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. నైపుణ్యాభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయించగా ఈ నిధుల వ్యయంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలకు అంకురార్పణ జరిగే అవకాశాలున్నాయి

వేమవరంలో పట్టపగలు చోరీ

- 13 సవర్ల బంగారం, రెండు లక్షల నగదు అపహరణ

6

పడవ, బల్లకట్టు రేవులకు నేడు బహిరంగ వేలం

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- అధికారులను ఆదేశించిన ఎస్పీ తుషార్‌డూడీ



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ తుషార్‌డూడీ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ 37 మంది అర్జీలు అందజేశారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ ఆయా పోలీసుస్టేషన్‌లకు వాటిని పంపించారు. చట్టపరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసాగా పోలీసుశాఖ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి సీఐ యు.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్‌కు రూ.లక్ష అడిగారు

- వీఆర్వోపై ఆర్డీవోకు ఫిర్యాదు

చీరాల: వెబ్‌ల్యాండ్ కోసం తమను వీఆర్వో రూ.లక్ష డిమాండ్ చేశాడని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు బల్లికురవ మండలం ముక్తేశ్వరం పంచాయతీ పరిధికి చెందిన ఇద్దరు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక ఆర్డీవో అధ్యక్షతన జరిగింది. ఓ వృద్ధురాలు, అతనితో పాటు వచ్చిన వ్యక్తి వీఆర్వో లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ అర్జీ ఇచ్చారు. వెబ్ ల్యాండ్ కోసం తమను రూ.లక్ష డిమాండ్ చేయగా, రూ.20 వేలు ఇస్తామని చెప్పామని, అందుకు వీఆర్వో అంగీకరించలేదన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీవో బల్లికురవ తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తనకు అందిన అర్జీకి సంబంధించిన వివరాలు తెలుపుతూ వీఆర్వోపై గోప్యంగా విచారణ జరిపి వాస్తవాలను తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

8

శివోహం

- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- భక్తజన సంద్రంగా అమరావతి అమరేశ్వరాలయం
- కోటప్పకొండలో భక్తుల కోలాహలం
- కాకాని మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి



పెదకాకానిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్న భక్తులు, పర్యాటకుల





అమరావతిలోని అమరేశ్వరస్వామి మూలవిరాట్

పార్టీ అండగా ఉంటుంది : ఎమ్మెల్యే ఆనందబాబు


గుంటూరులో చికిత్స పొందుతున్న రాజేంద్రప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లిపర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తూమాటి రాజేంద్రప్రసాద్‌ను ఇసుక రీచ్‌లో వైసీపీ నాయకులు ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. అతనిని ఆదివారం రాత్రి మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేంద్రప్రసాద్‌ను సోమవారం హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ల సురేష్‌రెడ్డి, జి. పొలెష్ తదితరులు ఉన్నారు.

పడవ, బల్లకట్టు రేవులకు నేడు బహిరంగ వేలం

గుంటూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పడవ, బల్లకట్టు రేవులకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా పరిషత్‌లోని డిప్యూటీ సీఈవో కార్యాలయంలో సీల్డ్ టెండర్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అచ్చంపేట మండలంలోని చామర్రు - కాసరబాద (కృష్ణా జిల్లా), చింతపల్లి-ఈస్తేపల్లి (కృష్ణాజిల్లా), గింజుపల్లి-వేదాద్రి (కృష్ణా జిల్లా), తాడువాయి-రామన్నపేట (కృష్ణా జిల్లా), మాదిపాడు-ముక్త్యాల (కృష్ణా జిల్లా), మాదిపాడు-బుగ్గ మాదరం (సూర్యాపేట జిల్లా), మాచవరం మండలం గోవిందాపురం-చింతిర్యాల (సూర్యాపేట జిల్లా), అమరావతి మండలం దిడుగు- ఏటూరు (కృష్ణా జిల్లా), ధరణికోట-కునికినపాడు (కృష్ణా జిల్లా), కొల్లిపర మండలంలోని వల్లభాపురం- వల్లూరుపాలెం (కృష్ణా జిల్లా) రేవులకు వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

15న రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు

గుంటూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో ఈనెల 15న కళాశాల మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తు కోసం అమ్మాయి దృష్టి (గర్ల్స్ విజన్ ఫర్ ది ఫ్యూచర్)అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుం, ఐడీ కార్డు, ప్రిన్సిపల్ అధికారిక లేఖతో రావాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ. 2 వేలు అందిజేస్తామని తెలిపారు.

14న కౌముది కిరణాలు పుస్తకావిష్కరణ

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న భారతీ విద్యాభవన్‌లో కౌముది కిరణాలు అనే పుస్తకావిష్కరణ జరుగుతుందని సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. కిరణ్ ప్రభ, కాంతికిరణ్‌లతో ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. 14న సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకానికి కిరణ్ ప్రభ పేరు చిరపరిచితమేనన్నారు. నాలుగు దశాబ్దాల కిందటే 'ఫోటో కవిత' అనే సరికొత్త సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు.

వైన్ షాప్‌పై.. టీడీపీలో వైరం!

- లైసెన్స్‌దారుడు ఎంచుకున్న స్థలం నుంచి మార్చాలని ఓ మంత్రి హుకుం..
- అక్కడ పెడితే అతని మిత్రుని బార్‌కి ఇబ్బందట!
- పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు
- రంగంలోకి సీనియర్ టీడీపీ ఎమ్మెల్యేలు
- ఆ షాపును కదిలిస్తే ఊరుకోమని వార్నింగ్

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైన్ షాపుల విషయంలో జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి మాత్రం ఆ వార్నింగ్‌లు తనకు వర్తించవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. లాటరీలో షాపును దక్కించుకున్న ఓ మద్యం వ్యాపారి గుంటూరు నగరంలోని లక్ష్మీపురం ప్రాంతంలో ఓ షాపును లీజుకు తీసుకొని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ప్రస్తుతం టెంపరరీ లైసెన్స్‌తో ఆ షాపు నడుస్తుంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఆ షాపు ఉన్నప్పటికీ ఇంతవరకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకుండా ఎక్సైజ్ అధికారులు కాలయాపన చేస్తున్నారు. కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ ఆ వ్యాపారి తిరుగుతున్నా పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకపోగా, అతనికి ఓ ఉచిత సలహా ఇచ్చారు. అక్కడ కాకుండా ఇంకొంచెం దూరంలో షాపు చూసుకొని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన షాపులో సర్వ హంగులు ఏర్పాటు చేసినందుకు రూ. లక్షల్లో ఖర్చు పెట్టిన ఆ వ్యాపారి నిర్ఘాతపోయాడు. ఎందుకు మార్చమంటున్నారని ఆరా తీయగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి ఆ షాపును అక్కడ నుంచి మార్పించాలని హుకుం జారీ చేసినట్లు ఆ షాపు యజమానికి తెలిసింది. దీనికి కారణం ఆ షాపునకు కొద్ది దూరంలో మంత్రిగారి మిత్రుడికి బార్ ఉండటమే. అక్కడ బ్రాందీ షాపు ఏర్పాటు చేయటం మూలంగా ఈ కొద్ది రోజుల్లోనే తన మిత్రుడి బార్‌కు వ్యాపారం తగ్గిపోవటంతో సదరు మంత్రిగారికి కోపం వచ్చిందట. మిత్రుడి కోసం ఆ మంత్రి బ్రాందీ షాపును అక్కడ నుంచి మార్చాల్సిందేనని ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి తేవడం మూలంగా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. మంత్రి జోక్యం చేసుకున్నారనే విషయం తెలుసుకున్న బ్రాందీ షాపు యజమాని తనకు పరిచయం ఉన్న టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి విషయాన్ని విన్నవించి వాపోయినట్లు తెలిసింది. దీంతో పల్నాడు ప్రాంతానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఒకరు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఆ షాపును అక్కడ నుంచి కదిలిస్తే ఊరుకోనని ఎక్సైజ్ అధికారులకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. నిబంధనలకు అనుగుణంగా ఆ షాపు ఏర్పాటు చేసి ఉండకపోతే చెప్పండి తీసేపిస్తా, అంతేగానీ మంత్రి చెప్పాడనో, ఇంకొకరు చెప్పారనో మీరు తల ఊపి తప్పుడు పనులు చేస్తే ఊరుకోనని వార్నింగ్ ఇవ్వటంతో ఎక్సైజ్ అధికారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిగా మారింది. ఏదైతే అది అవుతుంది న్యాయం పక్షానే నిలుద్దామనే ఉద్దేశంతో మంత్రికి పరిస్థితి వివరించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి ఈ నెల 10వ తేదీతో పర్మినెంట్ లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ ముగిసిపోవాల్సి ఉంది. ఆదివారం రాత్రి ఆ బ్రాందీ షాపునకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వాలనే ప్రయత్నంలో ఉండగా ప్రభుత్వం ఈ నెల 15 వరకు గడువు పొడిగించింది. దీంతో ఆ షాపునకు లైసెన్స్ ఇచ్చే ప్రక్రియను మరో రెండు, మూడు రోజులకు వాయిదా వేశారు. ఈ లోగా మంత్రికి పరిస్థితిని వివరించాలని భావిస్తున్నారు.

25 షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు పెండింగ్

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మొత్తం 256 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతివ్వగా ఇందులో 231 షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు మంజూరు చేసేశారు. మరో 25 షాపులకు మాత్రం వేర్వేరు కారణాలతో ఇంకా పర్మినెంట్ లైసెన్స్‌లు ఇవ్వలేదు. గుంటూరు జిల్లాలో 11 షాపులకు లైసెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఒకటి లక్ష్మీపురం బ్రాందీ షాపు, మిగతా పది జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 14 షాపుల లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. కొద్ది రోజుల క్రితం మాత్రం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు తమ సంగతి ఏంటంటూ వాటాల కోసం, మామూళ్ల కోసం ఒత్తిడి చేయటంతో వారిని ఎలాగానో ఒప్పించుకొని ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని చోట్ల షాపులు దక్కించుకున్న వారు రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేక వదిలేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న లైసెన్స్‌ల విషయంలో ఒకటి, రెండు చోట్ల మినహా మిగతా చోట్ల చెప్పుకోదగ్గ అభ్యంతరాలు లేవని అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారుల పక్కన ఉండకూడదనే నిబంధనకు విరుద్ధంగా టెంపరరీ షాపులు ఏర్పాటు చేసుకున్న వారు కొద్ది దూరం వెనక్కి వెళ్లి కొత్త షాపు ఏర్పాటు చేసుకోవటంలో జాప్యం మూలంగా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు ప్రక్రియ ఆగిందని, త్వరలో అందరికీ పర్మినెంట్ లైసెన్స్‌లు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్లు ఇవే..


ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి బాలికల జట్టు

సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు, పరిశీలకులు డాక్టర్ పి.ప్రభాకర్ సోమవారం ప్రకటించారు. బాలుర జట్టు వివరాలు ఇలా.. జె.మోజెస్ రాజు, ఎం.ముకేష్, ఈవీల్ స్మిత్, ఎ.స్టాలిన్(గుంటూరు), వి.శర్వంత్, బీఎం.సాయిచంద్ర, సీహెచ్.దుర్గా ప్రసాదు, సీహెచ్ సందీప్ (విశాఖపట్నం), కె.జయంత్, బి.అభిరామ్ రాజు, బి. ఈశ్వర్(కర్నూలు), కె.సాయి మోక్ష, ఎన్.జోయల్ (ప్రకాశం), ఎ.చైతన్య, పి.మనోజ్ కుమార్ (విజయనగరం), జి.నవదీప్ (కడప), పి.రిషీతేజ (అనంతపురం), ఎ.అబ్దుల్ మజీద్ (చిత్తూరు), స్టాండ్ బైగా బి.ఈశ్వర్ (అనంతపురం), పి.సంగీత్ (కృష్ణ), టి.కుమార్ (తూర్పు గోదావరి) ఎంపికయ్యారు. బాలికల జట్టు వివరాలు ఇలా.. బి.అనూష, ఎస్ఆర్ఎస్ఎస్ శ్రీ, లిఖిత, జి.కీర్తన (అనంతపురం), టి.అరుణ, ఎన్.దీపిక, కె.అంజనాదేవి (వైఎస్ఆర్ కడప), ఎం.పవిత్ర, టి.యామిని, ఎల్ శివ దుర్గ, బి.అఖిల (గుంటూరు), ఎస్ రేష్మ, జి. హేమ ఆసిని (విశాఖపట్నం), జి.హేమశ్రీ, వై.షైనీ (తూర్పు గోదావరి), పి.భవ్య (పశ్చిమ గోదావరి), ఎస్.మహాలక్ష్మి (విజయనగరం), సీహెచ్ పూజిత (ప్రకాశం), స్టాండ్ బైగా దీప్తి (తూర్పు గోదావరి), భవాని (పశ్చిమ గోదావరి), హెచ్ మధు (అనంతపురం), జె.శ్రీలక్ష్మి (గుంటూరు) ఎంపికయ్యారు. బాలికల జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా నారాయణరావు, లాకు పిచ్చయ్య, టి.ప్రకాష్‌రెడ్డి వ్యవహరించారు. బాలుర జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా సిటీ కౌర్, లూర్దుమేరీ, అనిల్ దత్తా నాయక్ వ్యవహరించారు. రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల జట్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

ఉద్యోగాలు, పరిశోధనలకు విజ్ఞాన్ వర్సిటీ పెద్దపీట

- ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్
- వర్సిటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- విజ్ఞాన్ వర్సిటీ వీసీ ఆచార్య పి.నాగభూషణ్



మాట్లాడుతున్న వీసీ ఆచార్య నాగభూషణ్

గుంటూరు (విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడం వంటి సమున్నత లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి. నాగభూషణ్ సోమవారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ 2025-26కు సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఫార్మ్-డీ అడ్మిషన్ల కోసం వీశాట్ - 2025-26 నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ తాము బీటెక్‌లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈ వీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మాడీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, డిప్లొమా (సీఎస్ఈ. ఈసీఈ) కోర్సులను అందజేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్), బీఎస్సీ (ఆక్చూరియల్ సైన్స్), బీబీఏ, బీసీఏ, బీఏ (ఎల్ఎల్‌బీ), బీబీఏ (ఎల్ఎల్‌బీ), ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లిష్, పీహెచ్‌డీ కోర్సులను కూడా అందజేస్తున్నామని చెప్పారు. బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు తాము దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం కలదన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి అనుబంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వీశాట్‌లో తొలి 50లోపు ర్యాంకులు సాధించిన వారికి 50శాతం, 51 నుంచి 200లోపు ర్యాంకుల వారికి 25 శాతం, 201 నుంచి 2000లోపు ర్యాంకులు సాధించినవారికి 10 శాతం ఫీజు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మార్కులు, జేఈఈ, మెయిన్స్, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగానూ ఫీజు స్కాలర్‌షిప్‌కు అవకాశం ఉందని తెలిపారు. తమ విద్యార్థులు ప్రఖ్యాత సంస్థలైన టీసీఎస్, ఐబీఎం, విప్రో, హెచ్‌సీఎల్, సీటీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ వంటి తదితర 65 సంస్థల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీ బీటెక్ కోర్సుతోపాటుగా ఆసక్తి ఉన్న విద్యార్థులకు సమాంతరంగా సివిల్స్ కోచింగ్ కూడా ఇస్తోందని తెలిపారు. డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణ కిషోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.గౌరిశంకర్ రావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళందే విజయం


బాలికల కబడ్డీ జట్టుకు కప్ అందజేస్తున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం బాల, బాలికలు ప్రథమస్థానం సాధించడం అభినందనీయమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులను వేగేశన నరేంద్రవర్మ పరిచయం చేసుకున్నారు. కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ పోటీలు బాపట్ల జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి షేక్.కరీముల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలుర కబడ్డీ పోటీల్లో అండర్-14 స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం, బాలికల కబడ్డీ పోటీల్లో అండర్ 14 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం సాధించాయి. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ప్రశాంతబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కేర్ విద్యాసంస్థల అధినేత వేగేశన రాధాకృష్ణరాజు, వేగేశన కిషోర్‌రాజు, ఎంఈవోలు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, కె.రాజారత్నం, క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమవరంలో పట్టపగలు చోరీ

- 13 సవర్ల బంగారం, రెండు లక్షల నగదు అపహరణ

మాచవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జక్కుల సైదులు కూలీల ముఠామేస్త్రిగా పని చేస్తుంటాడు. రోజు వారి లాగానే కూలీలను తీసుకొని పొలానికి వెళ్లాడు. ఇదే అదునుగా గమనించిన చోరులు మధ్యాహ్నం ఇంటికి వేసిన రెండు తాళాలను పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాను కూడా పగల గొట్టారు. బీరువాలో ఉన్న 13 సవర్ల బంగారం, రూ.2 లక్షల నగదును దొంగిలించారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళాలు పగలగొట్టి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా బీరువా తీసి ఉంచి, అందులో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బంగారం తన కుమార్తెదనీ, రూ.2 లక్షల నగదులో రూ. 1.50 లక్షలు కూలీలకు పంచాల్సిన డబ్బులనీ, మరో రూ.50 వేలు తన సొంతమని తెలిపాడు. మాచవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జక్కుల సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పల్నాడు జిల్లా క్లూస్ టీమ్ సందర్శించి వేలి ముద్రలు సేకరించారు.

ఎన్నికల హామీల అమలుకు అద్దంపట్టే బడ్జెట్

- మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలుకు అద్దంపట్టేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన చేసి కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారన్నారు. సంపదను సృష్టించాలన్న సీఎం ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన బడ్జెట్ ఇదని కితాబు ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించటం సంతోషకరమన్నారు. నీటి పారుదల శాఖకు గత ప్రభుత్వం కంటే రెండు రెట్లు అదనంగా నిధులు కేటాయించటం రైతుల్లో ఆనందాన్ని నింపుతుందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ప్రజారంజకంగా రాష్ట్ర బడ్జెట్

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పేందుకు బడ్జెట్‌లో పొందుపరిచిన అంశాలే నిదర్శనమన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు వ్యవసాయ రంగంలో రైతులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు వేర్వేరుగా బడ్జెట్ కేటాయింపులు చేశారని తెలిపారు. రైతు సంక్షేమ పథకాలతోపాటు ప్రాజెక్టు నిర్మాణాలు, రైతాంగ సమస్యల పరిష్కారానికి సంబంధించి బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా కేటాయింపులు జరిగాయన్నారు. కేవలం వ్యవసాయమే కాకుండా ఇతర అన్ని శాఖలకు సంబంధించిన విభాగాలకు ఆయా శాఖల ద్వారానే బడ్జెట్ ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్థిక కష్టాల్లోనూ సానుకూలమైనది

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కష్టాల్లోనూ సానుకూల బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం రూపొందించిందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షోభంలో అవకాశాలు వెతకడం సీఎం చంద్రబాబుకు కొత్తేమీ కాదనీ అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి బలమైన పునాదులు వేశాలా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తలపెట్టిన స్వర్ణాంధ్ర సంకల్పానికి ఈ బడ్జెట్ నాందిగా చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. సాగునీరు, వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. నదుల అనుసంధానం పూర్తయితే కరువు విముక్త ఆంధ్రప్రదేశ్ సాకారం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు.

అన్నివర్గాలకు మేలైనది

- ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ అరాచక ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పతనావస్థకు తీసుకెళ్లిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేసేదిగా ఉందన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, పంచాయతీరాజ్ రోడ్లకు నిధులు విడుదల, సంక్షేమానికి పెద్దఎత్తున నిధుల కేటాయింపు చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మున్ముందు చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. పారిశ్రామికంగా పురోగతి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని, అన్నివర్గాలకు ప్రయోజనం చేకూర్చే బడ్జెట్‌గా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 25 లక్షలు వసూలు

రెంటచింతల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తామని ఓ అభ్యర్థి నుంచి రూ. 25 లక్షలు తీసుకున్న వ్యక్తిపై ఎస్ఐ సీహెచ్ నాగార్జున కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెంటచింతలకు చెందిన షేక్ మస్తాన్ బీ డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు హాజరయ్యే నిమిత్తం పేరేచర్లలోని ఓ ఎగ్జామ్ సెంటర్‌కి 2023 ఏప్రిల్‌లో వెళ్లారు. అక్కడ పరిచయమైన లోకేష్ రెడ్డి (కడప జిల్లా వాసి) ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి విడతల వారీగా రూ.25 లక్షలు వసూలు చేశాడు. ఎస్ఐ శిక్షణకు సిద్ధం కావాలంటూ తరచూ మెస్సేజ్‌లు పెట్టేవాడు. చివరకు ఇది ఫేక్ అని తెలియడంతో ఈ నెల 4న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 587.10 అడుగులు ఉంది. ఇది 305.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3490 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 16,410 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,410 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 290 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా ఆరు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

43,750 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 46,099 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,750 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,972 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	8500	14000
నెంబరు. 5	10500	14000	నెంబరు. 5	9000	13500
273	9000	11500	273	--	--
341	8000	15000	341	8500	15500
4884	10000	12000	4884	14000	14000
సూపర్ 10	11500	12000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18000	తేజ	9000	17000
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	10000	15500	దేవనూరు డీలక్స్	10000	13500
తెల్లకాయలు	5000	11000	తెల్లకాయలు	5000	10500



గ్రాడ్యుయేషన్ దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా గ్రాడ్యుయేషన్ దివ్యాంగులకు కలెక్టర్ జె.వెంకటమురళి సోమవారం ల్యాప్‌టాప్‌లు ఉచితంగా అందజేశారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న ఐఐటీ, పాలిటెక్నిక్, గ్రాడ్యుయేషన్ విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులందరికి ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందజేస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఆరుగురు దివ్యాంగులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఒక్కొక్కరికి రూ.35 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌లు అందించటం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేటపాలెం మండలంలోని పందిళ్ళపల్లి బీసీ సంక్షేమశాఖ వసతిగృహానికి ఆరు ఫ్యాన్‌లను దాతలు విరాళంగా ఇవ్వగా కలెక్టర్ చేతులమీదగా బీసీ సంక్షేమశాఖాధికారి రాజేష్‌దాసు అందుకున్నారు.

సచివాలయాల వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలి : సీపీఐ

బాపట్ల నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈనెల 18వ తేదీన సచివాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశంలో పట్టణ కార్యదర్శిగా మామిడిబత్తుల అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌన్సిల్‌మెంబరు వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి సింగరకొండ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో రెండుసెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడుసెంట్లు చొప్పున నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చీలురోడ్డుసెంటర్‌లో నినాదాలు చేశారు. కార్యక్రమంలో బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్, పోలిరెడ్డి, ఫణీంద్ర, కొండలురెడ్డి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ప్రకటించిన హామీలన్నీ అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా కౌన్సిల్ సమావేశం కౌన్సిల్ సభ్యులు దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి విల్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈనెల 18న పేదల ఇళ్ళ స్థలాల కోసం అర్జీలు సచివాలయాలలో అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్, బత్తుల శామ్యూల్, తుమ్మల పూర్ణాచంద్రశేఖర్, సైకం రాజశేఖర్, జె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన : సీపీఎం

బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : అధిక ధరలు, నిరుద్యోగ సమస్య, మహిళలపై జరుగుతున్న దాడులు తదితర అంశాలపై సీపీఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 15వ తేది వరకు ప్రజాపోరు జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఉప్పరపాలెం పరిసరాలలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిత్యావసర, కూరగాయల ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగయువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.కొండయ్య, కె.శరత్, కె.నాగేశ్వరరావు, రంగారెడ్డి, సుభానీ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటను కాపాడుకోవాలి

● ఏవో సునీత



వేమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగులో వివిధ దశల్లో ఉన్న పైర్లలో వచ్చే మార్పులను గమనిస్తూ రైతులు సస్యరక్షణ చర్యలతో పంటను కాపాడుకోవాలని వేమూరు మండల వ్యవసాయాధికారిణి (ఏవో) సునీత పేర్కొన్నారు.



వరి పైర్లు ఏ దశల్లో ఉన్నాయి?

ఏవో: మండల పరిధిలో నాటిన వరి పైర్లు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. ముదురు పైర్లు దాదాపు గింజ గట్టిపడి కోతలకు సిద్ధమవుతున్నాయి. లేత పైర్లు పాలు పోసుకునే దశలో ఉన్నాయి.

ప్రస్తుతం ఏవైనా తెగుళ్లు వ్యాపించాయా?

ఏవో: పైర్లు చేతికొస్తున్న దశలో ఆకుముడత, కాండం తొలిచే పురుగు, పొడ తెగులు వ్యాపించాయి.

తెగుళ్ల నివారణకు సూచనలు?

ఏవో: ఆకు ముడత తెగులు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు మందును ఒక లీటరు నీటిలో కలపాలి లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు కార్బొఫిరాన్ 3 శాతం గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున లేదా కొలాన్‌ట్రానిప్రోల్ 0.5 శాతం గుళికలను ఎకరాకు నాలుగు కిలోల చొప్పున పొలంలో సమానంగా చల్లాలి. పొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 5, ఈసీ 2 ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఎలుకలు నియంత్రించబడ్డాయా?

ఏవో: రైతులు ఎలుకల నివారణకు సామూహికంగా మందును వాడని కారణంగా పూర్తిగా నివారించబడలేదు. ఇప్పటికైనా రైతుల పైర్లను కాపాడుకునేందుకు బ్రోమోడైలిన్ మందును పొలం గట్లపై ఉన్న గడ్డిని తొలగించి ఎలుకల బొరియల్లో వేసి నివారించాలి.

కోడిపర్రులో అధ్వాన పారిశుధ్యం

● స్తంభించిన మురుగునీరు
● నిధులు మంజూరైన నిర్మాణాలు నిల్
● హామీని నిలబెట్టుకొని నాటి ఎమ్మెల్యే



కోడిపర్రులో స్తంభించిన మురుగు నీరు



రోడ్లపైకి పారుతున్న మురుగునీరు



కోడిపర్రులో పూడిపోయిన మురుగు కాల్వలు

వేమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనర్ గ్రామమైన కోడిపర్రు గ్రామంలో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పంచాయితీరాజ్ శాఖ ద్వారా పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడం మురుగునీటి కాల్వల నిర్మాణాలు చేపట్టకపోగా పూడికలు తీయకపోవడం వల్ల ఎక్కడి నీరు అక్కడే స్తంభించిపోయింది. కాల్వలు మురుగు నీటితో నిండిపోయి ఆ నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీరు వద్ద క్రిమి కీటకాదులు పెరిగిపోయాయి. దుర్గంధ భూయిష్టంగా గ్రామ వాతావరణం తయారై గ్రామంలోని ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో మురుగునీటి కాల్వల నిర్మాణం కోసం 2022లో రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారు నాటి శాసన సభ్యులు, మంత్రిగా ఉండి ఆ నిధులు వినియోగించే విషయంలో దృష్టి పెట్టలేదు. దీంతో కాంట్రాక్టర్లు ముందుకు రాక ఆ నిధులు మురిగిపోయాయి. ఎన్నికల ముందు గ్రామస్తులకు ఇచ్చిన హామీ నెరవేరకుండా పోయింది.

దీనిపై పంచాయితీరాజ్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే తమ వద్ద నిధులు లేని కారణంగా చర్యలు చేపట్టలేకపోతున్నామని సమాధానం ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో స్థానిక శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తమ గ్రామంపై దృష్టి పెట్టి మురుగు కాల్వల నిర్మాణాలను చేపట్టేందుకు నిధులు మంజూరు చేయించి సహకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

● కలెక్టర్ జె.వెంకటమురళి
● అర్జీలు పెండింగ్‌లో ఉంటే క్రమశిక్షణా చర్యలు
● సమస్యలు పరిష్కారం కోరుతూ 150 అర్జీలు



అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి



ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రాన్ని అందిస్తున్న అర్జీదారులు

బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవటం మంచి పద్ధతి కాదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 150 మంది వచ్చి అర్జీలు అందజేసి తమ సమస్యలను వివరించారు. అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ ఆయన పరిధిలో వాటిని తక్షణమే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించారు. అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. సత్వరమే వారికి న్యాయం చేయాలన్నారు. అన్ని మండలాలలో ల్యాండ్‌బ్యాంక్, ఖాళీభూముల వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు, తహసీల్దార్‌లు విచారించాలని ఆయన సూచించారు. గడువు తీరిన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని తహసీల్దార్‌లను జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. గడువుతీరినప్పటికి అర్జీలు పెండింగ్‌లు ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి తీరువా వసూళ్ళు చేసే బాధ్యత తహసీల్దార్‌లపై ఉందని చెప్పారు. కొన్నిప్రాంతాలలో పన్నులు వసూళ్ళు చేయకపోవటంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపై అన్నిరకాల పన్నులు, ఫీజులు ఎత్తివేయాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో భవననిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం ఏదైతే వాగ్దానం ఇచ్చిందో ఆ వాగ్దానం నిలబెట్టుకోవాలని, సంక్షేమబోర్డు నుండి ప్రభుత్వం తీసుకున్న 1600 కోట్ల రూపాయలను సంక్షేమబోర్డు నందు వెంటనే జమచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

● అలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ గద్దె విజయలక్ష్మి భర్త చేబ్రోలు బోడెయ్య గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టకపోగా గ్రామంలోని పంచాయతీ చెరువులోని చేపలను పట్టుకొని విక్రయించుకొని సుమారు రూ.3 లక్షల వరకు అవినీతికి పాల్పడటం జరిగిందని గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సదరు సర్పంచ్ భర్తపై సంబంధితాధికారులు చర్యలు తీసుకొని పంచాయతీకి రావాల్సిన నిధులను అతని ద్వారా ఇప్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కువినతి అందజేయటం జరిగిందన్నారు.

రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికను ప్రజలుసద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. కొల్లూరు మండలం ఈపూరులంక గ్రామానికి చెందిన కలపాల పెద్దయ్య తమ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, సర్వేచేసి భూమిని ఇప్పించాలని కోరారు. భట్టిప్రోలు మండలం ఓలేరుగ్రామానికి చెందిన రెబ్బా సాంబశివరావు లంకభూమి పట్టా మంజూరు చేయాలని కోరారు. కొల్లి శేషకృష్ణ 20 సంవత్సరాల నుంచి నీటి తీరువా బకాయిలు చెల్లించటం లేదని అనుమతి లేకుండా పంట భూములకు రొయ్యల చెరువులుగా మార్చుకున్నాడని, 20 ఎకరాల భూమిలో సుమారు 3 వేల ట్రాక్టర్ల మట్టిని తవ్వి అక్రమంగా అమ్ముకున్నాడని విచారించి తగు చర్యలు తీసుకోవాలని రేపల్లె మండలం నల్లూరు నార్త్ గ్రామానికి చెందిన పుట్టగుంటి బుచ్చిరామయ్య కోరారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన ఓలేటి వీరయ్య తాను రిటైర్డ్ ఉద్యోగినని, తనకు 2022 సంవత్సరం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అర్జీలు ఆయా శాఖల అధికారులకు అందించి సమస్యలు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్డీవో తెలిపారు.

మహనీయుల స్ఫూర్తితో దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



మౌలానా అబుల్‌కలాం ఆజాద్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తదితరులు.

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల స్ఫూర్తితో దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి కార్యక్రమాన్ని మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కలాం పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతస్వాతంత్ర్య సమరయోధులు, దేశానికి తొలి విద్యాశాఖా మంత్రి అబుల్‌కలాం ఆజాద్ వంటి మహనీయుల త్యాగాలను నేటియువతరానికి తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధరరావు, ఆర్డీవో పి.గ్లోరియా, మైనార్టీసంక్షేమశాఖ సిబ్బంది, ముస్లిం పెద్దలు అలీఉల్లాఖాన్, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయం వద్ద

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కార్యాలయం వద్ద సోమవారం జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. దేశ తొలి విద్యాశాఖా మంత్రి అబుల్‌కలాం ఆజాద్ పటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో విద్యావ్యాప్తికి నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి ఈనాటి ఐఐటిలకు ఆనాడే అంకురార్పణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ రాజేష్, భీమా లీలాకృష్ణ, శీలం శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, భోగిరి రామారావు, చింతా కిషోర్, జనసేన నాయకులు కృష్ణ, కె.అంజనేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● దేశంలో విద్యారంగం అభివృద్ధికి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ఆజాద్ 137వ జయంతి కార్యక్రమంలో సాహితీభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షులు మర్రిమాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ ఆజాద్ సేవలు నిరూపమానమని ఆజాద్ జయంతిని జాతీయ విద్యాదినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం రచయితలు ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎం.జాకబ్ తదితరులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చీరాల గోవర్ధనరెడ్డిని పరామర్శించిన తెన్నేటి, సలగల



గోవర్ధనరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, రాజశేఖర్

బాపట్ల రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : బాపట్ల మాజీ శాసన సభ్యులు చీరాల గోవర్ధనరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న లోకసభ ప్యానల్ స్పీకర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు వారి నివాసానికి వెళ్ళి పరామర్శించి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వం నాలుగు నెలల్లోనే రోడ్లు ఏర్పాటు



రోడ్డులు పనులు పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు పిట్టల వసంతరెడ్డి తదితరులు

కర్లపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రోడ్లు వేస్తున్నట్లు టీడీపీ నాయకుడు పిట్టలవసంతరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యం.వి.రాజుపాలెంలో పెద్దకాపు ఇంటి రోడ్డును ఉపాధిహామీ పథకం నిధులతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఆట్ల బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో నారాయణ స్కూల్ విద్యార్థులకు పతకాలు

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలో జరిగిన 9వ జాతీయ ఆహ్వాన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో బాపట్ల నారాయణ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పతకాలు సాధించారు. కటా విభాగంలో ఈశ్వర్, హర్ష, విజయ్, అయ్యప్పలు బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా సింగిల్ కటా విభాగంలో ఈశ్వర్, హర్ష, విజయ్, అయ్యప్పలు బ్రాంజ్‌మెడల్స్ సాధించారు. బాలికల విభాగంలో రేవతి, అమీనా కటా విభాగంలో గోల్డ్‌మెడల్స్ సింగిల్ కటా విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కోచ్‌గా ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యరాణి సోమవారం అభినందించారు.

శివాలయాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు



రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు



జంపని రామేశ్వరస్వామికి నక్షత్ర హారతి



విశేష పూజలు అందుకున్న విరలేశ్వరస్వామి

వేమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం రెండవ సోమవారం పురస్కరించుకుని మండల పరిధి గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజామున స్వామి వారికి శైవ ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకులు నమక చమకాలు, పంచ సూక్తాలు రుద్రంతో ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. చావలి వాలేశ్వరాలయంలో ప్రత్యేకించి అష్టోత్తర సహస్ర నామాలతో బిల్వ దళాలు, పొన్న పూలతో పూజ జరిపారు. జంపని రామేశ్వరాలయంలో స్వామి వారిని వెండి సర్వభరణంతో అలంకరించి పంచ హారతులు సమర్పించారు. ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేమూరు, చదలవాడ, అబ్బనగూడవల్లి, బూతుమల్లి, వరహాపురం, చంపాడు, పెరవలి గ్రామాల్లో శివునికి వార్షిక నక్షత్ర పూజలు నిర్వహించారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామునే కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని శైవ క్షేత్రాలకు భక్తులు చేరుకుని కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. కొల్లూరు మండలంలోని చిలుమూరు వద్ద కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఉభయ రామేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

● కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని ఐలవరంలో గ్రామదేవత పైడమ్మ తల్లి సన్నిధిలో జరిగిన సమారాధనలో అయ్యప్ప స్వాములతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వరస్వామికి అభిషేకం

బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎన్‌పి అగ్రహారంలో ఉన్న శ్రీ గంగాపర్వతవర్ధని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలలో భాగంగా సోమవారం ప్రాతఃకాల అభిషేకం అనంతరం స్వామివారు విశేష అలంకారంలో శశిశేఖరునిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రసాదస్వామి ఆధ్వర్యంలో గూడూరి చిట్టిబాబు, పంగలూరి కౌండిన్యశర్మ, నెమలికంటి హనుమంతరావు సహకారంతో ఆలయధర్మకర్త ఆదూరి హరినారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అంకమ్మతల్లి ఆలయంలో కోటిదీపోత్సవం

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శీలంవారిపాలెంలో ఉన్న అంకమ్మతల్లి ఆలయంలో బండ్రెడ్డి రజనీ ఆధ్వర్యంలో కార్తీకమాసం రెండోవ సోమవారం సందర్భంగా కోటిదీపోత్సవం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి శివస్తోత్రం పుస్తకాలు పంపిణీ చేశారు.

మురుగు ప్రవాహానికి అడ్డుగా గుర్రపుడెక్క



బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వరద నీటి ప్రవాహానికి గుర్రపుడెక్క, తూటి, తుంగ అడ్డంకిగా మారుతున్నది. దీనివల్ల ముంపునకు గురైన పొలాలలో నీరు బయటకెళ్ళక పైరు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలలో కురిసిన భారీవర్షాలతో ముంపునకు గురైన పొలాలు అనేకం దెబ్బతిన్నాయి. ఆ తర్వాత రైతులు అనేక వ్యయ ప్రయాసాలతో పొలాలను మరలా దమ్ము చేసి నాటుకున్నారు. ప్రస్తుతం పొలాలు బాగున్నప్పటికి మరలా వర్షాలు వస్తే మురుగు బయటకెళ్ళకుండా పెరిగిన గుర్రపుడెక్క అడ్డుగా ఉంటుందని జమ్ములపాలెం రోడ్డులోని ఈస్ట్, వెస్ట్ డ్రైన్‌ల పక్కనే ఉన్న ఆయుకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజి అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బాపట్ల మండలం జమ్ములపాలెం రోడ్డులోని వెస్ట్‌డ్రైన్‌లో పెరిగిన గుర్రపుడెక్క

క్రికెట్ టోర్నమెంట్ విజేత బాపట్ల జిల్లా పోలీసు జట్టు

● అభినందించిన ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : బాపట్ల క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహించిన మ్యాచ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో బాపట్ల జిల్లా పోలీసు జట్టు విజేతగా నిలిచింది. విజేతలను ఎస్పీ తుషార్‌డూడి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. గెలుపొందిన కప్పును, నగదు బహుమతిని వారికి అందజేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో బాపట్ల స్ట్రయికర్స్ జట్టుపై పోలీసు జట్టు విజయం సాధించింది. ఎస్పీ మాట్లాడుతూ పోటీలలో జిల్లా పోలీసు జట్టు పాల్గొని విజయం సాధించటం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఐటీ కోర్ ఎస్ఐ నాయిబ్ రసూల్, సీసీ హరికృష్ణ పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జిల్లా పోలీసు జట్టును అభినందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

అంతర్జాతీయంగా క్రీడల్లో గుర్తింపుతెచ్చిన వెంకట్రావు

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

నగరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాన్ని ప్రపంచస్థాయికి గుర్తింపు తెచ్చేలా పోరాడి విజయం సాధించిన క్రీడాకారుడు గుంటూరు వెంకట్రావు అని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని బెల్లంవారిపాలెం గ్రామానికి చెందిన గుంటూరు వెంకట్రావు మలేషియాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఓపెన్ అథ్లెటిక్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికే పేరు తెచ్చారన్నారు. హైజంప్‌లో గోల్డు మెడల్, ట్రిపుల్‌జంప్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన వెంకట్రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, అనగాని శివప్రసాద్, రేపల్లెనియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, టీడీపీ, బీజేపీ, జనసేనపార్టీ నాయకులు పాల్గొన్నారు.



వెంకట్రావును సన్మానిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, బుడా ఛైర్మన్ రాజశేఖర్, శివప్రసాద్

వరద బాధితులకు కిట్లు పంపిణీ

కొల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కృష్ణానది వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో అమెరికాస్ హనీవెల్ సంస్థ సహకారంతో గుంటూరు డైసీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఆవులవారిపాలెం క్రీస్తులంకలో బాధిత కుటుంబాలకు హనీవెల్ సంస్థ ప్రతినిధులతో కిట్లు పంపిణీ చేసిన అనంతరం డైరెక్టర్ జయరాజ్ మాట్లాడుతూ బాధితులకు ఇప్పటి వరకు ఒక్కొక్క కుటుంబానికి రూ.6 వేల విలువ చేసే కిట్లను వివిధ గ్రామాల్లో 2334 కుటుంబాలకు అందించడం జరిగిందన్నారు. డైసీస్ కోఆర్డినేటర్లు బాబ్జీ, సూరిబాబు, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి

కొల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పదవిని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎంప్లాయీస్ ఇన్‌ఫర్మేషన్ వ్యవస్థాపకులు అళ్లమూడి ప్రభాకరరావు కోరారు. నాలుగు దఫాలుగా మాల సామాజిక వర్గానికి చెందిన వారే ఛైర్మన్ పదవులు పొందుతున్నారన్నారు. ఈసారి మాదిగ సామాజిక వర్గానికి ఛైర్మన్ పదవిని కేటాయించడంతో పాటు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను నియమించి దళితులకు సమన్యాయం చేయాలని ప్రభాకరరావు ఒక ప్రకటనలో కోరారు.

వివాదాస్పద పోస్టులు పెడితే ఉపేక్షించం : సీఐ



మల్లికార్జున్‌రావు

రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో ప్రజల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెడితే చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో కొంతమంది అల్లరి మూకలు ఇష్టానుసారంగా ప్రజల మనోభావాలు దెబ్బతినేవిధంగా పోస్టులు పెడుతూ విషసంస్కృతికి తెరలేపుతున్నారని, అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టిసారించామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కుటుంబాలను కించపరిచే విధంగా పేస్‌బుక్‌లో పోస్టులు పెట్టిన ఎస్.బాలాజీరెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు. చెరుకుపల్లిలో రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇంటి, నీటి పన్నులను త్వరితగతిన చెల్లించాలి

రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నివాసం ఉంటున్న ప్రజలు ఇంటిపన్ను, నీటిపన్ను బకాయిలను చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధిలో పాత్రులుకావాలని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల బకాయిల కంటే నీటిపన్నుల బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలకు నిరంతరాయంగా నీటి సరఫరా చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. బకాయిలు ఎక్కువగా పేరుకుపోయి ఉండటంతో కొంతమేర ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నాయని, తక్షణమే ప్రజలు డిసెంబరు 31లోపు పన్నులు చెల్లించాలని కోరారు. ఖాళీస్థలం పన్నులు, షాపుల అద్దెలు సకాలంలో చెల్లించాలని కోరారు.

17న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మాస్టర్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ ఈనెల 17వ తేది ఉదయం 9 గంటలకు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సెక్రటరి షేక్ నజీర్ తెలిపారు. క్రీడలకు 30 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులు అర్హులు అన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్ పాస్ పోర్ట్‌సైజు ఫొటోతో హాజరు కావాలన్నారు. ఈసెలక్షన్స్‌లో అర్హత పొందిన క్రీడాకారులు గుంటూరులో జరిగే స్టేట్‌మీట్‌కు అర్హులు అన్నారు.



శివోహం..

- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపారాధనలు
- భక్తజన సంద్రంగా అమరావతి అమరేశ్వరాలయం
- కోటప్పకొండలో భక్తుల కోలాహలం
- కాకాని మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పవిత్ర కార్తీకమాసం రెండవ సోమవారం ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. 'ఓం నమశ్శివాయ.. హర హర మహాదేవ.. శంభో శంకర' మంత్రోచ్ఛరణలను పఠిస్తూ భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అమరావతి శ్రీ అమరేశ్వరాలయం, పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం, నరసరావుపేట కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయం, బాపట్ల పట్టణంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ప్రముఖ పర్యాటక ప్రాంతం సూర్యలంక సముద్ర తీరంలో భక్తులు కార్తీకమాస పుణ్యస్నానాలను ఆచరించి, పూజలను నిర్వహించారు.

అమరావతి, నరసరావుపేట, బాపట్లరూరల్, పెదకాకాని, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా దేవేంద్రునిచే ప్రతిష్ఠించినట్లు పేర్కొన్న అమరావతిలోని అమరేశ్వరాలయం భక్తజనంతో సంద్రంగా మారింది. పంచారామాలు దర్శించుకునే భక్తులు ఆదివారం అర్ధరాత్రి నుండి ప్రత్యేక వాహనాలలో ఆలయానికి చేరుకుని తెల్లవారు జామున రెండు గంటలనుండి పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీకదీపాలు వెలిగించారు. కార్తీకదీపాలను కృష్ణమ్మ అలలపై వదలి ఆరనీకుమా ఈదీపం కార్తీకదీపం అంటూ తమ భక్తిభావం చాటుకున్నారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో రావడంతో కృష్ణాతీరం, ఆలయ ప్రాంగణము, ప్రధాన రహదారిలో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. భక్తులకు ఆలయ అధికారులు తాగునీరు, ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఏఎస్పీ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో పలువురు సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పీ.సునీల్‌కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్తీకదీపాలతో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు దంపతులు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



శ్రీ త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురష్కరించుకొని శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీమేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీత్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి శ్రీత్రికోటేశ్వర స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ అధికారులు నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి కొండకు ప్రత్యేక సర్వీసులు నడిపారు.

సూర్యలంక తీరం ఒడ్డున కార్తీకమాస పూజలు

ఎంతో పవిత్రమైన కార్తీకమాసం రెండోవ సోమవారం బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో భక్తులు పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే తీరంకు చేరుకొని భక్తులు సూర్యలంకతీరంలో పుణ్యస్నానాలను ఆచరించి తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాలను నిర్మించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు తీరం ఒడ్డున కార్తీకదీపాలను వెలిగించి పూజలను నిర్వహించి అనంతరం సముద్రదేవునికి తాంబూలాన్ని సమర్పించారు. తీరం ఒడ్డున కార్తీక పూజలు జరిపిన అనంతరం బాపట్ల పట్టణంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి తరలి వెళ్లి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్తీక మాసం రెండోవ సోమవారం కావటంతో సూర్యలంకతీరం భక్తులతో పరవశించిపోయింది. తీరానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బాపట్లరూరల్, మెరైన్ పోలీసులు బందోభస్తును నిర్వహించారు.



బాపట్ల సూర్యలంక సముద్రతీరం ఒడ్డున ఇసుకతో శివలింగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు





కాకాని మల్లన్న సన్నిధిలో
కార్తీక దీపాలంకరణలు

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలోని యజ్ఞాల బావి వద్ద భక్తులు కార్తీకమాస స్నానమాచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణములో కార్తీక దీపారాధనలు చేశారు. క్యూలలోని భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, తాగు నీరు అందించారు. శ్రీ స్వామి వారి నిత్య అన్నప్రసాద భవనంలో భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కళ్యాణ కట్ట వద్ద పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయ అన్ని విభాగాలలోని కార్యక్రమాలను ఆలయ ఉప కమిషనరు కేబీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్తీకమాస 2వ సోమవారం వివిధసేవా రుసుములు, ప్రసాదం విక్రయం, అన్నప్రసాద విరాళములు ద్వారా రూ.6,50,000 పై చిలుకు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఉప కమిషనరు తెలిపారు. పోలీసు, అగ్నిమాపక, పంచాయతి, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొన్నట్లు ఉప కమిషనరు తెలిపారు.

అమరావతికి ఆన్‌లైన్ రివర్ వాటర్
క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్

- ఔత్సాహికుల నుంచి టెండర్ల ఆహ్వానం

విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నగరానికి సురక్షిత మంచినీటిని అందించేందుకు వీలుగా సీఆర్‌డీఏ అధికారులు 'ఆన్‌లైన్ రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్' ఏర్పాటుకు ఈవోఐ పిలిచారు. రాజధాని ప్రాంతానికి అందించే మంచినీరు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు కృష్ణానదిలోని నీటి వనరుల నాణ్యతను పరిశీలించేందుకు ఈ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఇదంతా ఆన్‌లైన్ విధానంలో పని చేస్తుంది. ఆన్‌లైన్ రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్లను సీఆర్‌డీఏ కోరింది. ఈ నెల 15వ తేదీలోపు ఔత్సాహికులు తమ టెండర్లను అందజేయాలని తెలిపింది.

అభివృద్ధి, సంక్షేమానికి
రాష్ట్ర బడ్జెట్ దోహదం

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరుసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర సంక్షేమం అభివృద్ధికి దోహదపడుతుందని ఉమ్మడి గుంటూరుజిల్లా పరిషత్ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌పై సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి రూ. 2లక్షల 94వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖకు రూ.16,739కోట్ల కేటాయింపు హర్షణీయమన్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమానికి రూ.39 వేల ఏడు కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.18,497కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7557 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.4,376 కోట్లు, మహిళశిశు సంక్షేమానికి రూ.4285 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.4012 కోట్లు, పరిశ్రమలు వాణిజ్యానికి రూ.3127 కోట్లు, ఇంధన రంగానికి రూ.8207 కోట్లు, పట్టణ అభివృద్ధికి రూ.11490కోట్లు కేటాయించడం అభినందనీయమని అన్నారు. ఇంకా కొన్నిశాఖలకు ప్రభుత్వం కేటాయించిన నిధులవలన ప్రయోజనం కలుగుతుందని, గతప్రభుత్వంలో బడ్జెట్‌లో కేటాయించినవి ఆయాశాఖలకు అందలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

గంజాయి మత్తులో విద్యార్థులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరేంద్రబాబు, కింద కూర్చొనివున్న నిందితులు

- 25 మంది సభ్యుల ముఠా అరెస్టు
- 7.2 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితుల్లో అత్యధిక మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులే ..
- వివరాలు తెలిపిన గుంటూరు పట్టాభిపురం సీఐ .. మిగిలిన వారిని పట్టుకుంటామని వెల్లడి

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఏడుగురుతో పాటు తాగుతున్న 18 మందిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేసారు. వారి నుంచి 7.2 కిలోల గంజాయి, రూ. 3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో ఎక్కువ మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉండటం ఆందోళన కలిగించే విషయం. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీరేంద్రబాబు ఈ కేసులోని నిందితుల వివరాలను వెల్లడించారు.

నగరంలో శ్రీనివసరావుపేట, సంగడిగుంట, చంద్రాబాబు కాలని, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామానికి చెందిన అల్తాఫ్ దావుద్దిన్, రోషన్, యూసుఫ్‌లు ముగ్గురు ఓ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం, అనిల్ డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నారు. యూసుఫ్ మెకానిక్ గాను, సుధాకర్ వంట మేస్త్రి గాను, బాలాజీ కూలి పనులు చేసుకుంటూ ఉండేవారు. వీరంతా గంజాయి, చెడు అలవాట్లకు బానిసలుగా మారి తమ వ్యసనాలకు అవసరమైన డబ్బుల కోసం గంజాయి అమ్మేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో అల్తాఫ్, దావుద్దిన్, రోషన్, బాలజీలు గత నెల 8న వారి ద్విచక్రవాహనాలపై అరకు వెళ్లి భీం, దీపక్ అనే ఇద్దరి వద్ద గంజాయి కొన్నారు. గుంటూరులో గంజాయిని ఇతరులకు లాభానికి అమ్మే అనిల్, సుధాకర్‌లను కలిశారు. వీరంతా సోమవారం నేతాజీ నగర్ చెరువు వద్దకు వచ్చి ఉండగా పట్టాభిపురం పోలీసులు వారిని పట్టుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి గంజాయి తెచ్చి అమ్ముతున్న శ్రీనివాసరావుపేట 11వ లైనుకు చెందిన షేక్ అల్తాఫ్, సంగడిగుంట 11వ లైనుకు చెందిన మొహమ్మద్ దావుద్దిన్, శ్రీనివాసరావు పేట 1వ లైనుకు చెందిన షేక్ యూసుఫ్, తన్నీరు బాలాజీ, కొత్తపేట 1వ లైనుకు చెందిన షేక్ రోషన్, శావల్యాపురం మండలం పిచికలపాలెంకు చెందిన ఏగినాటి. అనిల్, చంద్రబాబు కాలని 6వ లైను, పొన్నూరు రోడ్డుకు చెందిన పందిరి సుధాకర్ తదితరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అదే విదంగా గంజాయి తాగుతున్న గౌడ లిఖిత్ (నల్లపాడు), కుంచేపు శ్యాం కుమార్ (కేవీపీ కాలనీ), పాకాల కిరణ్ బాబు (గడ్డిపాడు), సిరిగిరి వెంకట శివ (శ్రీనివసరావుపేట 6వ లైను), తోట వెంకటేష్(బ్రాడిపేట 6/21), అవుకు సాయి తేజ (ఫాతిమా పురం 4వ లైను), మద్దు మోనిష్ (శ్రీనివసరావుపేట సుజాత కాన్వెంట్ వెనుక), అలపాటి వెంకట సుదీర్ బాబు (కొరిటెపాడు), పెద్దింటి చరణ్ (చాగల్లు గ్రామం, తూర్పు గోదావరి జిల్లా), కొప్పుల నితిన్ (డొంకరోడ్డు, కాకుమానువారి తోట), యామ ప్రణవ గణేష్ (బాలాజీ నగర్ 4వ లైను, రెడ్డిపాలెం), కొక్కిలిగడ్డ దిలీప్(మైనేని కాలని), భూషణ్ పాణిగ్రాహి(మెళియాపుట్టి, రాత్తిని, శ్రీకాకుళం జిల్లా), హరికొట్ల జయంత్(ఖమ్మం పట్టణం), అబ్బూరి భాస్కర్(ఖమ్మం పట్టణం), పుట్టగుంట రానసింహ దత్తు(జేకేసీ కాలేజీ రోడ్డు), మన్నే తులసిరాం (నాయుడుపేట 2వ లైను కొరిటెపాడు), బిల్లా రబ్బాని (కేవీపీ కాలని1/4) తదితరులను అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసారు. అదేవిదంగా అరకులో వీరికి గంజాయి విక్రయించిన భీం, దీపక్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ వీరేంద్రబాబు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐ నరహరి, ఏఎస్ఐ అంజనేయులు, హెడ్ కానిస్టేబుళ్ళు వాకా రామారావు, బీ నరసింహారావు, కానిస్టేబుళ్ళు వై మానిక్యాలరావు, బీ బ్రహ్మం, సైదులు, పీ శివనాగరాజు, శేఖర్ తదితరులను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

బడుగు, బలహీనవర్గాల ఆశీస్సులే
నా ఎదుగుదలకు కారణం

- టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'నా రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూశాను. రెండు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీ, మూడుసార్లు టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎన్నికయ్యానంటే బడుగు బలహీనవర్గాల ప్రజల దీవెనలే కారణం. వారిని ఎప్పటికీ మర్చిపోను' అని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. సోమవారం నారాయణపురంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జంగా కృష్ణమూర్తికి పల్నాడు బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మానసభ జరిగింది. సభకు ముఖ్యఅతిధిగా హాజరైన జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా మొదలైన తన రాజకీయ జీవితం గ్రామ సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా నియామకం కావడానికి బడుగు బలహీనవర్గాలకోసం తాను చేసిన పోరాటమే కారణమన్నారు. పల్నాడు ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రం నలుమూలల వున్న ఎంతో మంది బడుగు బలహీన వర్గాల నాయకులు ఐక్యంగా వుండి ఆర్థిక, సామాజిక, రాజకీయంగా పురోభివృద్ధి సాధించాలన్నారు. తనకు టీటీడీ బోర్డు సభ్యుడిగా పదవి రావడానికి సహకరించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సభకు దాచేపల్లి 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బెహరా వెంకట శ్రీనివాసరావు, గద్దల వేదమణి, కనిగిరి విశ్వనాథం, మందా శంకర్, పెరుమాళ్ల వెంకట నరసింహారావు, హసన్ అహ్మద్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నిర్లక్ష్యానికి మందు లేదు !



ఒక పక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులులేక రోగులు అల్లాడిపోతున్నారు. వచ్చిన మందులను వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రులకు పంపిణీ చేయకుం డా వ్యర్థం చేస్తున్నారు. ఆ మాటలకు బలం చేకూర్చేదే ఈ చిత్రం. గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సెంట్రల్ డ్రగ్‌స్టోర్ పక్కనేవున్న భవనం లో రోగులకు అందజేయాల్సిన మందులను ఇలా వరండాలో బయట పడేసారు. అవి వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతున్నాయి. జిల్లా కార్యాలయంలోనే ఈ స్థాయిలో నిర్లక్ష్యం ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పరిస్థితి ఏమిటో.! - గుంటూరు సిటీ

యూనియన్ బ్యాంక్
విశేష సేవలు

- దేశవ్యాప్తంగా 8,500 శాఖలు
- 9000 ఏటీఎంలు
- ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరి మెండు మహేంద్ర భాస్కరరావు

కర్లపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో 1919 సంవత్సరంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాలుగు బ్రాంచ్‌లతో ప్రారంభమై నేడు 8,500 బ్రాంచ్‌లకు విస్తరించిందని, 9000 ఏటిఎంలతో ఖాతాదారులకు విశేష సేవలదిస్తుందని ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ జనరల్‌సెక్రటరి మెండు మహేంద్రభాస్కరరావుఅన్నారు. యూనియన్ బ్యాంక్ కర్లపాలెంశాఖలో సోమవారం 106వ ఫౌండేషన్ దినోత్సవాన్ని మేనేజర్ కె.మానసా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కరరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1973వ సంవత్సరంలో కర్లపాలెంలో యూనియన్ బ్యాంక్ స్థాపించారని, 30 వేల మంది ఖాతాదారులకు యూనియన్ బ్యాంక్ విశేష సేవలందిస్తుందన్నారు. చిన్న వృత్తి, వ్యవసాయాధారులకు, చేతి వృత్తిదారులకు, స్వయం సహాయక సంఘాలకు, చిన్న,పెద్ద పరిశ్రమలకు అనేక రంగాల వారికి యూనియన్ బ్యాంక్ ఆర్థికసాయం అందిస్తూ దేశ, ఆర్థిక సామాజిక అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుత ఎండీ, సీఈవో మని మొక్కలాయ్ వివిధ రంగాల్లో బ్యాంక్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సిబ్బంది కృషితోనే బ్యాంక్ నేడు ఈ స్థాయికి చేరుకుందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.మానస, ఏపీఎమ్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేనేజర్ బాను, యూనియన్‌బ్యాంక్ సిబ్బంది అనీషా, మనోజ్, గోపి, జగదీష్‌కుమార్, రాజమోహన్‌రెడ్డి, జనకమహరాజు, ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మెండు మహేంద్రభాస్కరరావు

ముగిసిన రాష్ట్రస్థాయి
బేస్‌బాల్ పోటీలు

- బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటిన గుంటూరు జిల్లా జట్టు
- బాల, బాలికల విభాగంలో అండర్ 17కు ఎంపికైన నేషనల్ టీం



రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముఖ్య అతిథులు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుటూరుజిల్లా, యనమదల మండల పరిధిలోని యనమదల జడ్పీ హైస్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు సోమవారం ముగిసాయి. జాతీయ జట్టుకు ఎంపికలతో పాటు వివిధ జిల్లాల మధ్య పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా బాలికలు సత్తాచాటి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్రం తరుపు నుంచి ప్రాతినిధ్యం వహించే జట్టును అన్ని జిల్లాల క్రీడాకారుల నుంచి ఎంపిక చేశారు. సెమీఫైనల్స్‌కు బాల బాలికల విభాగాలలో 8 జిల్లాల జట్లు తలపడగా అందులో 4 జిల్లా జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలలో బాలికల విభాగంలో ప్రథమస్థానంలో గుంటూరు జిల్లా, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో విజయనగరం, నాలుగవ స్థానంలో ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో విజయనగరం, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో ప్రకాశం, నాలుగవ స్థానంలో కర్నూలు జిల్లా జట్లు నిలిచాయి. అనంతరం రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ పీ.బాలసుబ్రమణ్యం,సర్పంచ్ ఆదినారాయణ, ఎస్ఎంసీ ఛైర్మన్ చౌదరిబాబులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం నాగేశ్వరరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరావు, ఇంటర్నేషనల్ సాఫ్ట్‌బాల్ రెఫరీ జగదీష్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ పేరం మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విజయనగరం జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముఖ్య అతిథులు


విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ హేమ మాధురి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాలలో, ఇళ్ల వద్ద వాతవరణం మార్పుల వలన వచ్చే రుగ్మతల పట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఎం.హేమమాధురి అన్నారు. సోమవారం అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురుకి మందులను అందజేశారు. త్రాగునీరు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఎటువంటి ఆనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డాక్టర్ హేమమాధురి స్వీట్‌లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకులు, ఉపాధ్యాయులు, ఆ రోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది కొరత ఉంది
చెత్తను తగులబెట్టడం లేదు

చీరాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రామాపురం వద్ద ఉన్న సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్‌లో పనిచేసే సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవం. కొత్తగా సిబ్బందిని తీసుకుని టెండర్లు పిలిచి వర్మీ కంపోస్ట్ ప్రాసెస్ చేసేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో చె(చి)త్త శుద్ధి శూన్యం అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. చెత్తను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ జిందాల్ గుంటూరుకు మున్సిపల్ హైడ్రాలిక్ కాంపాక్టర్ ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. చెత్తను తగుల బెట్టటం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో ఎలాంటి ప్రక్రియ జరగటం లేదని, యంత్రాలు పనిచేస్తున్నాయా లేదా అన్న విషయంతో పాటు, అధికారులు క్షేత్రస్థాయిలో అక్కడకు వెళ్లి పరిశీలస్తే వాస్తవాలు వారికే తెలుస్తాయని అక్కడ పనిచేసేవారు చెప్పడం విశేషం.

భక్తిశ్రద్ధలతో పడిపూజ, భజన

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వద్ద ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం పడిపూజ, భజన కార్య క్రమాలు భక్తితో నిర్వహించారు. నాగేంద్ర భజన బృందంచే గీతాలాపన చేశారు. వాసు గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భజన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, రామలింగేశ్వరరావు, బాపయ్య, వినయ్ గురుస్వామి, అంజయ్య, పూజారి సూర్య పాల్గొన్నారు.

అపరాల సాగుపై దృష్టి సారించాలి

అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని నాగులపాడు, వెంకటాపురం గ్రామాలల్లో రైతులకు శిక్షణ కేంద్రాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, ధరలు ఉన్నాయని అందరూ పొగాకు సాగుపై దృష్టి పెడుతున్నారని, దీని వలన ధరలు పతనమై నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్నారు. రాయితీపై శనగలు అందిస్తున్నామని పొగాకు ప్రత్యామ్నయంగా శనగా, మినుము, మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. శనగలో తప్పనిసరిగా ట్రైకో డర్మా విరిడి ద్వారా కేజీ విత్తనానికి 5 గ్రాములు కలిపి విత్తన శుద్ధిని చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు, మినుములో రసం పీల్చు పురుగు, పల్లాకు తెలుగు నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు అనూష, సీత పాల్గొన్నారు.

15 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గంగాధరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. పేరు తప్పులు ఉంటే టీసీ, పుట్టిన తేదీ తప్పు ఉంటే డేట్‌ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్ తీసుకుని వచ్చి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అ కాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ తమ పాఠశాలలో అపార్ ఐడీ పెండింగ్ ఉన్న విద్యార్థులకు తప్పులు సరి చేయించాలని సూచించారు.

సర్వసభ్య సమావేశం 17కి వాయిదా

మేదరమెట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి సోమవారం ప్రకటన తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం సెలవు రోజులలో మాత్రమే సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని ఈ నెల 13 జరగాల్సిన సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్ డే

మేదరమెట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండల పరిషత్ కార్యాయలంలో మంగళవారం చీరాల ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆ యన కోరారు. మండలంలోని ప్రజలందరు అన్ని రకాల సమస్యలపై అ ర్జీల రూపంలో ఈ కార్యక్రమంలో అందించవచ్చని ఈ అ వకాశాన్ని మండల ప్రజలందరు సద్వినియోపర్చుకోవాలని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు రెండు గ్రామాలలో ఇద్దరు వ్యక్తుల వద్ద 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై సీఐ భవాని, ఎస్సై విష్ణువర్ధన్‌రెడి ఆధ్వర్యంలో సోమవారం పంగులూరు మండలం తక్కెళ్లపాడు, అద్దంకి మండలం నాగులపాడులో దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తక్కెళ్లపాడులో పాలపర్తి ఏడుకొండలు వద్ద 12, నాగులపాడులో ఆంజనేయులు వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

112 మద్యం బాటిళ్ల పట్టివేత.. ఇద్దరిపై కేసు

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భుజంగరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. మండలంలోని జేఎంపీ అగ్రహారంలో 48 మద్యం సీసాలను అక్రమంగా ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా మంగళగిరికి చెందిన ఎస్టీఎఫ్ టీమ్ సభ్యులు మార్టూరు జాతీయ రహదారిపై మద్యం అక్రమ సీసాలు కల్గిఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నట్లు సీఐ తెలిపారు. అతని వద్ద నుంచి 20 మద్యం సీసాలు, 44 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కార్మికులకు రెండు నెలల జీతాల చెల్లింపు

ఇంకొల్లు,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు సక్రమంగా అందలేదు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా వీరు విధులకు హాజరు కాలేదు. దీంతో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. ఎక్కడ చెత్త అక్కడే తాండవిస్తూ కంపుకొడుతోంది. సోమవారం పంచాయితీ పారిశుధ్య కార్మికుల ఖాతాలకు రెండు నెలల జీతాలను జమ చేసినట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నుంచి కార్మికులు విధులకు హాజరవుతారని చెప్పారు.


చీరపై రంగులతో డిజైన్లు వేస్తున్న బాలశంకర్ దంపతులు

ఆన్‌లైన్‌లో ఆదరణ ఎక్కువగా ఉంది



మేం వేసే డిజైన్లకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. ఒకప్పుడు సరదాగా నేర్చుకున్న కళ, ప్రస్తుతం మాకు, మాతో పాటు మరికొంత మందికి భృతి కల్పిస్తోంది. మన్ననలు పొందగలుగుతున్నాం. అదే మాకు తృప్తి.

- బూదాటి బాలశంకర్,
తయారీదారుడు,
తోటవారిపాలెం

రంగు రంగులలో.. ఎన్ని హంగులలో..!

- చీరలపై డిజైన్లు చీరాలకే సొంతం
- తోటవారిపాలెంలో దంపతుల హ్యాండ్ డిజైన్ వర్క్
- చేతి కుంచెలతో ఆకర్షణీయంగా తయారు
- వివిధ ప్రాంతాలకు పెరుగుతున్న ఆర్డర్లు

చీరాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాదా చీరలపై రంగు, రంగుల డిజైన్లు, ఆకర్షణీయమైన హ్యాండ్ వర్క్ చీరాల ప్రత్యేకత. మండలంలోని తోటవారిపాలేనికి చెందిన ఇరువురు దంపతులు సాదా చీరలపై చేతి కుంచెలతో వివిధ రంగుల డిజైన్లు వేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మొదట రోజుకు ఒకటి, రెండు చీరలపై డిజైన్ చేసే వీరు ప్రస్తుతం రోజుకు సుమారు 15 నుంచి 20 చీరలు తయారు చేసే స్థాయికి ఎదిగారు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన బూదాటి బాలశంకర్, భ్రమరాంబ దంపతులు సాదా చీరలపై రకరకాల డిజైన్లు వేస్తూ మన్ననలు పొందుతున్నారు. బాలశంకర్ తన 12వ ఏట నుంచే రంగులతో హ్యాండ్ వర్క్ చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఆకురాతి నాగేశ్వరరావు అనే పెయింటర్ ఈయనకు స్ఫూర్తి. గోడలపై రంగులు వేసే నాగేశ్వరరావు వద్ద ఈయన శిక్షణ పొందారు. సాదా వస్త్రాలపై రంగులతో డిజైన్లు వేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ముందడుగు వేశారు. చూసిన వారందరూ బాగున్నాయని మెచ్చుకునేవారు. దీంతో బాలశంకర్ అదే పనిని తన వృత్తిగా ఎంచుకున్నారు. వివాహం జరిగాక తన భార్య భ్రమరాంబకు ఆ కళను నేర్పారు. అప్పటి నుంచి దంపతులు ఇరువురు సాదా చీరలపై ఫెవికాల్ కలర్స్‌తో వివిధ రకాల డిజైన్లు వేస్తున్నారు. ఆర్డర్లపైనే వారు ఎక్కువగా డిజైన్లు చేస్తుంటారు. వారు చేసే డిజైన్లు వినియోగదారుల అభిరుచి మేరకు రూ.600 నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నారు. ఈ చీరలపై వేసే రంగులు ఉతికినా చెడిపోకపోవడం ప్రత్యేకత. చేతి కళలు అంతరించిపోతున్న తరుణంలో ఈ దంపతులు సృజనకు మారుపేరుగా తమ వృత్తిలో రాణిస్తూ, మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

40 మందికి సీఎం సహాయం అందజేత

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో నిరుపేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారికి అత్యుత్తమ వైద్య సేవలను అందించాలనే దృక్పథంతో 40 మందికి రూ.35,41,260 సీఎం సహాయ నిధి నుంచి నిధులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు చేతులమీదగా 40 మందికి చెక్కులను అందచేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలలోని గ్రామాలకు చెందిన పేద కుటుంబాలకు చెందిన వారు వైద్య సహాయం పొందేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో వారంతా తమ గ్రామానికి చెందిన నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిశారు. ఈ నేపథ్యంలో ఏలూరి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి బాధితుల వివరాలను తీసుకువెళ్లారు. దాంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి బాధితులకు మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు స్వయంగా బాధితులకు క్యాంపు కార్యాలయంలో అందచేశారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, హరిబాబు, నాగార్జున, రంగయ్య చౌదరి, శ్రీను, వెంకట్రావు పాల్గొన్నారు.


సీఎం ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన పెదగంజాం విద్యార్థులు

చినగంజాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రకాశం జిల్లా అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.దేవదత్తం తెలిపారు. పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన అభినందన సభలో క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఇటీవల కనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన అండర్ -17 క్రికెట్ పోటీలలో ప్రతిభ చాటి జిల్లా క్రికెట్ జట్టుకు ఆసోది బాలాజీరెడ్డి, అదనపు క్రీడాకారుడుగా మాచవరపు అభిరామ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఇద్దరు విద్యార్థులు పదో తరగతి చదువుతున్నట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం దేవదత్తం, ఇన్‌చార్జి డి.నారాయణరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సుదర్శనరెడ్డి, ఉపాధ్యాయులు ఎ.వీరాచారి, బి.చెంచురెడ్డి, కే.నాగరాజు, శ్రీరమణ, పీడీ ఎం.అనిల్‌కుమార్ అభినందించారు

నిధుల ఊరట

- వెలిగొండకు రూ.393.50కోట్లు
- గుండ్లకమ్మకు రూ.13కోట్లు
- రానున్న నాలుగు నెలల్లో చేపట్టే పనులకు వీలుగా కేటాయింపు
- అన్నదాత సుఖీభవకు గ్రీన్‌సిగ్నల్
- కేంద్రం ఇచ్చే రూ.6వేలకు మరో రూ.14వేలు అదనం
- 2.45లక్షల మంది రైతులకు లబ్ధి

ఒంగోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి రంగానికి నిధులు ఊరట కలిగింది. కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు రూ.393.50 కోట్లు కేటాయింపు జరగ్గా గుండ్లకమ్మకు రూ.13 కోట్లు కేటాయించారు. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనల్లో కేటాయింపులు జరిగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండుసార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లు ప్రవేశపెట్టగా పూర్తిస్థాయి వార్షిక (2024-25) బడ్జెట్‌ను సోమవారం శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదించారు. మొత్తం రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేశవ్ ఆయా రంగాలకు ప్రాధాన్యతలకు అనుగుణంగా కేటాయింపులు చేశారు. మొత్తం బడ్జెట్‌లో సుమారు రూ.43వేల కోట్లకుపైగా వ్యవసాయానికి కేటాయించగా మరో ప్రాధాన్యత రంగంగా ఉన్న నీటి పారుదల శాఖకు రూ.16,705కోట్లు కేటాయించారు. అలాగే వివిధ రంగాలకు అవసరాలను బడ్జెట్ కేటాయించారు.

రెండు కీలక ప్రాజెక్టులకు మంచిరోజులు

జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ, ఉపయోగంలో ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టులను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిన విషయం విదితమే. కీలకమైన 2023-24లో వెలిగొండకు రూ.101.4 కోట్లు మాత్రమే వైసీపీ ప్రభుత్వం కేటాయించగా అందులో కేవలం రూ.26.34కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. ఇక గుండ్లకమ్మ ప్రాజెక్టుకు రూ.30కోట్లు కేటాయింపు చేయగా రూ.3.87 కోట్లు ఖర్చుచేశారు. దాంతో వెలిగొండ పనులు ముందుకు సాగకపోగా గుండ్లకమ్మ గేట్లు మరమ్మతులకు కూడా నిధులు లేక రెండేళ్లుగా ఆయకట్టుకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ రెండింటిపై దృష్టిసారించింది. వెలిగొండలో రూ.100 కోట్లకుపైగా పనులు ఇప్పటికే చేయగా రూ.80 కోట్ల చెల్లింపులు కూడా జరిగాయి. అందుకు సంబంధించిన నిధులను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఇచ్చారు. మరో రూ.23 కోట్లు చెల్లించాల్సి ఉంది. కాగా ఇటీవల ప్రాజెక్టును ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించి సమీక్ష చేశారు. ఈ ఏడాది రానున్న నాలుగు నెలల్లో అవకాశం ఉన్నమేర పనులు చేస్తామని వాటికి అవసరమైన నిధులు ఇస్తామని చెప్పారు. అలాగే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. దానికి అనుగుణంగా ప్రస్తుతం బడ్జెట్‌లో కేటాయింపు కనిపించింది.

తక్షణ అవసరాల కోసం

ఔటాన్ బడ్జెట్‌లో ఇచ్చిన నిధులను కూడా కలిపి ఈ ఏడాదికి వెలిగొండకు రూ.393.50 కోట్లు కేటాయింపు చేశారు. అంటే ఇప్పటికే ఖర్చుచేసిన రూ.100 కోట్లు పోను రానున్న నాలుగు నెలలకు మరో రూ.200 కోట్లు ఖర్చు చేసేలా నిధులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం రూ.393.50 కోట్లలో ప్రాజెక్టు పనులకు రూ.248 కోట్లు కేటాయించగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు రూ.80కోట్లు, భూసేకరణకు రూ.48కోట్లు, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.16.42 కోట్లు కేటాయించారు. నిర్వాసితుల పునరావాసానికి ఇంకా భారీగా నిధులు అవసరం ఉండగా తక్షణం ప్రాజెక్టుకు నీరిచ్చే పరిస్థితి లేదు కనుక వచ్చే ఏడాది బడ్జెట్‌లో అందుకు కేటాయింపులు ఉంటాయని అధికారవర్గాల సమాచారం. ఇక గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గత వైసీపీ ప్రభుత్వం రూ.30కోట్లు కేటాయింపు చేసి రూ.3.87 కోట్లు మాత్రమే ఇవ్వగా ప్రస్తుత బడెట్‌లో తక్షణ అవసరాలకు అనుగుణంగా రూ.13కోట్లు కేటాయించారు. గేట్ల మరమ్మతుల కోసం రూ.6.50 కోట్లు ఇంకా అవసరం కాగా అవి పోను మిగిలిన ఈ నాలుగు నెలల నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది లేకుండా చేశారు.

నీటివనరుల అభివృద్ధికి నిధులు

ఇదిలా ఉండగా ఒంగోలులోని ప్రాజెక్టుల సీఈ పరిధిలో రాష్ట్రంలో ఎన్ఎస్‌పీ కాలువల నిర్వహణ మొత్తం ఉండగా వాటి కోసం రూ.128.62 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఎన్ఎస్‌పీ కాలువల నిర్వహణ సాగనుంది. ఇక ఈసీఈ పరిధిలో మొత్తం జలవనరుల శాఖ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు రూ.31.44కోట్లు, మీడియం ఇరిగేషన్, ఇతర పనులకు మరో రూ 6.20 కోట్లు కేటాయించారు. అలా మొత్తంగా ఒంగోలు కేంద్రంగా ఉన్న సీఈ పరిధిలో ఈ బడ్జెట్‌లో రూ.581.76 కోట్లు కేటాయింపు జరిగింది. అదే వైసీపీ ప్రభుత్వంలోని 2023-24లో ఈసీఈ పరిధిలోనూ రూ.301 కోట్లు కేటాయించి రూ.217.39 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు.

రైతులకు భారీ మేలు

ఆయా సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకంలో జిల్లా రైతాంగానికి భారీగా మేలు జరగనుంది. గతంలో కేంద్రం ఇచ్చే రూ.6వేలకు మరో రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13500లను రైతుభరోసా పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం రూ.20వేలకు పెంచనున్నట్లు ప్రకటించగా బడ్జెట్‌లో ఆమేరకు ఇవ్వనున్నట్లు వ్యవయాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. దాంతో ఒక్కొక్క రైతుకు అదనంగా ఏడాదికి రూ.6,500 రానుంది. జిల్లాలో మొత్తం 2.45 లక్షలమంది రైతులకు మేలు జరగనుంది. అయితే బడ్జెట్ కేటాయింపులపై విభిన్న రాజకీయ పార్టీలు విభిన్న రీతిలలో స్పందిస్తున్నాయి. ప్రజారంజకమైన బడ్జెట్‌గా అధికార టీడీపీ అభివర్ణిస్తుండగా అంకెల గారడీగా వైసీపీ విమర్శిస్తోంది. ఇతర వామపక్షాలు అసంతృప్తిని వ్యక్తం చేశాయి.

ముఖాముఖి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

చంద్రశేఖర్‌నాయుడు, ఆర్డీవో, చీరాల



చీరాల రెవెన్యూ డివిజన్‌కు కొత్తగా వచ్చాను. అవగాహన కల్పించుకుంటున్నాను. ప్రజలకు మెరుగైన సేవ్వందించేందుకు కృషి చేస్తా. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవంటూ పలు అంశాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి ప్రతినిధి సూటిగా అడిగిన ప్రశ్నలకు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు స్పష్టంగా సమాధానం చెప్పారు.

- చీరాలతో గతంలో పరిచయం ఉందా .. స్థానిక స్థితిగతులపై అవగాహన వచ్చిందా?

ఆర్డీవో : చీరాలకు రావడం ఇదే మొదటిసారి. స్థానిక పరిస్థితులపై అవగాహన కల్పించుకుంటున్నాను. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తాను. అందుకు ప్రజలు సహకరించాలి

- అనధికారిక లేఅవుట్లకు సంబంధించి ఏం చర్యలు చేపడుతున్నారు?

ఆర్డీవో : డివిజన్ పరిధిలో మొత్తం అనధికారిక లేఅవుట్లకు సంబంధించి సమాచారం తీసుకుంటున్నాం. అందుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించం.

- కార్తీక పౌర్ణమి స్నానాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

తీర ప్రాంతానికి కార్తీక పౌర్ణమి స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంధీకులకు చెప్పాం. నేను కూడా అధికారులు, సిబ్బందితో కలసి ఆయా ప్రాంతాలను పరిశీలించాను. తాత్కాలిక స్నానపు గదులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్యం తదితర ఏర్పాట్లలో ఏమాత్రం రాజీ పడొద్దని చెప్పాం. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

- ఇసుక అక్రమ రవాణా మీ దృష్టికి వచ్చిందా .. ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. ఉమ్మడి కార్యాచరణ కోసం మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి చర్యలు చేపడతాం. మైనింగ్ పాత్ర కీలకం. పట్టా భూములైనా ముందుగా మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి పొందిన తరువాత మాత్రమే ఇసుక తవ్వకాలు, రవాణా జరపాలి.

- పీవోటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్)కి సంబంధించిన అంశాలు ఏమైనా మీ దృష్టికి వచ్చాయా?

ఆర్డీవో : : పీవోటీకి సంబంధించి ఒక కేసు నా దృష్టికి వచ్చింది. దానిపై విచారణ జరుగుతోంది. విచారణ పూర్తయ్యాక చర్యలు చేపడతాం. అంతిమంగా నిబంధనలు అతిక్రమించేవారు ఎవరైనా చర్యలు తప్పక ఉంటాయి.

ఏపీవోపై టెక్నికల్ అసిస్టెంట్ కత్తితో దాడి
దాడిని అడ్డుకున్న కంప్యూటర్ ఆపరేటర్‌కు గాయాలు

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీవోపై టెక్నికల్ అసిస్టెంట్ కత్తితో దాడికి పాల్పడిన సంఘటన పర్చూరులోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కార్యాలయంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏపీవోకు స్వల్ప గాయాలు కాగా, అడ్డుకున్న కంప్యూటర్ ఆపరేటర్ మొఖంపై గాయాలయ్యాయి. కత్తితో దాడి జరుగుతున్న సమయంలో పెద్దగా కేకలు వినిపించడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. మధ్యాహ్నాం ఏపీవో బుల్లియ్య కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్ మొహిద్దీన్‌తో కలసి కార్యాలయంలోని ఆఫీసు రూంలో భోజనం చేస్తున్న తరుణంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్ర కత్తితో దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. అనంతరం కత్తిని అక్కడే వదిలేసి పోలీస్ స్టేషన్‌లో నిందితుడు లొంగిపోయినట్లు తెలిసింది. జీతాల బిల్లుల విషయంలో నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసిందని సిబ్బంది అంటున్నారు. పూర్తి విషయాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

ధ్యాన మందిర్‌లో చోరీ

పర్చూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : పర్చూరు పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఓం శాంతి ధ్యాన మందిరంలో రూ.30వేల నగదు, అరకేజీ వెండివస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆశ్రమ నిర్వహకులు భద్రాచలంలో ఓం శాంతి కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇక్కడ చోరీ జరిగినట్లు వారు తెలిపారు. సోమవారం ఆశ్రమానికి రాగా తాళాలు పగులకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతదేహానికి పోస్టుమార్టం

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్లో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆదివారం రాత్రి మృతిచెందిన ద్విచక్రవాహనదారుడు తమ్ములూరి నాగేశ్వరరావు మృతదేహానికి సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులు మండలంలోని రాజుపాలెంలోని స్వగృహానికి తీసుకువెళ్లారు. కుమారుడు పెద్దబ్బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించామన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

చినగంజాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చినగంజాం సమీపంలోని జాతీయ రహదారి రొంపేరు బ్రిడ్జి వద్ద సోమవారం వెలుగు చూసింది. ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపిన కథనం మేరకు పురుగు మందు తాగి గుర్తు తెలియని 60 సంవత్సరాల వ్యక్తి మృతి చెందారు. మృతదేహం వద్ద నవక్రాన్ పురుగుల మందు డబ్బా, థమ్స్ అప్ బాటిల్ ఉన్నాయి. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించిరట్లు ఎస్.ఐ తెలిపారు.

దాతల సాయం మరువలేనిది


రాత పుస్తకాలను పంపిణీ చేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

చినగంజాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని పాఠశాల హెచ్‌ఎం టీవీఎస్ శైలజకుమారి అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉప్పుగుండూరు వివేకానంద సేవా సమితి వారు సోమవారం రాత పుస్తకాలను పంపిణీ చేశారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం సూచించారు. గత పది సంవత్సరాల నుంచి వివేకానంద సమితి సభ్యులు సంవత్సరానికి రెండు సార్లు విద్యార్థులకు రాత పుస్తరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వివేకానంద సేవా సమితి సభ్యుడు పావులూరి శివాజీ పాఠశాలలోని విద్యార్థులకు రాత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, పాఠశాల ఉపాధ్యాయరాలు బి.సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి
విషమంగా పరిస్థితి

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే రైలు నుంచి చీరాలలో దిగుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతని శరీర భాగాలు తెగిపడ్డాయి.సమాచారం అందుకున్న 108 సిబ్బంది చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పేరు గిరి, తనది ఒంగోలు, అత్తవారి ఊరు రామకృష్ణాపురంగా గుర్తించారు. చీరాల ఏరియా వైద్యశాలలో అతనికి చికిత్స అందిస్తున్నారు.

గాడిన పడని అన్నగారి సంత

- వైసీపీ రాకతో అస్తవ్యస్తం
- రాజన్నగా పేరు మార్పు
- నాడు దళారులు లేకుండా నేరుగా రైతులు అమ్ముకునే అవకాశం
- తక్కువ ధరకే కూరగాయలు
- వ్యాపారంలోకి ప్రైవేటు వ్యాపారులు
- సమస్యలు పరిష్కరించాలని పాలకులు, అధికారులకు విజ్ఞప్తి


అద్దంకి మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న సంత


సంతలో పలుచగా ఉన్న కొనుగోలుదారులు


నామ్ రోడ్డుపై నిర్వహిస్తున్న దుకాణాలు

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మార్కెట్ యార్డ్ ఆవరణలలో నిర్వహించే సంతలు ఇంకా గాడిన పడలేదు. దశాబ్ద కాలం కిందట తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో అప్పటి అద్దంకి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వినూత్నంగా అన్నగారి సంత నిర్వహణ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చింది. రైతులే స్వయంగా తమ ఉత్పత్తులను తెచ్చుకొని అమ్మకాలు చేసుకునేలా ఎన్టీఆర్ పేరుతో అన్నగారి సంతగా నామకరణం చేసి ప్రారంభించారు. కొనుగోలుదారులకు తక్కువ ధరకే తాజా కూరగాయలు అందుబాటులోకి రాగా, రైతులకు కూడా ఉపయోగకరంగా దళారులు లేకుండా తాము పండించిన కూరగాయలను నేరుగా అమ్ముకునే అవకాశం రావడంతో రైతులకు కూడా లాభదాయకంగా మారింది. అద్దంకి మార్కెట్ యార్డు పరిధిలోని అద్దంకి, మేదరమెట్ల, పంగులూరులో ఉన్న యార్డులలో నిర్వహించారు. కొంత కాలం తరువాత పంగులూరులో నిలిపివేశారు. ఆదివారం అద్దంకిలో, బుధవారం మేదరమెట్లలో నిర్వహిస్తున్నారు. ముందురోజే ఆయా కూరగాయల ధరలను నిర్ధారించి, కచ్చితంగా ఆయా ధరలకే అన్ని దుకాణాలలో నిర్వహించేలా చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నగారిసంత పేరును రాజన్న సంతగా మార్పు చేశారు. నిర్వహణపై మార్కెట్ కమిటీలు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సంతలో రైతుల స్థానంలో కొంత మంది వ్యాపారులు రంగ ప్రవేశం చేయడంతో సంత నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. దీంతో ఎవరి ఇష్టం వచ్చిన ధరలకే వారు అమ్మకాలు చేయడం ప్రారంభించారు. దీంతో సంత పట్ల ప్రజలలో ఆసక్తి తగ్గింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నగారి సంతకు పూర్వ వైభవం వస్తుందని ప్రజలు భావించారు. అయితే ఇంకా మార్కెట్ కమిటీ నియామకం జరగకపోవడంతో సంత నిర్వహణను కొంత మంది టీడీపీ నేతలు అనధికారికంగా నిర్వహిస్తున్నా ఇంకా గాడిన పడలేదన్న విమర్శలు వస్తున్నాయి. ధరలపై నియంత్రణ లేకపోవడంతో నిర్దిష్టమైన ధరలు లేకుండా పోయాయి. అదే సమయంలో ఎవరికి వారే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా అమ్మకాలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీ ఏర్పడే వరకు కనీసం మార్కెట్ యార్డులో పని చేసే సిబ్బంది ద్వారా అయినా పర్యవేక్షణ చేసేలా చర్యలు చేపట్టి అన్నగారి సంత పూర్వవైభవం చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. రైతులు పండించిన కూరగాయలను రైతులే స్వయంగా వచ్చి అమ్మకాలు చేసుకునే విధంగా రూపకల్పన చేసి మార్కెట్ యార్డు ఆధ్వర్యంలోనే నిర్వహించే విధంగా అన్ని అనుమతులు తీసుకుంటే మార్కెట్ యార్డు కమిటీలు లేనప్పుడు కూడా స క్రమంగా నిర్వహించే వీలుంటుందని పలువురు అభి ప్రాయపడుతున్నారు. ప్రస్తు తం అలా కాకుండా మార్కెట్ యార్డు పర్యవేక్షణ లేకుం డా అనధికారికంగా నిర్వహిస్తుండడంతో అజమాయిషీ లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కచ్చితంగా మార్కెట్ యార్డు ఆధ్వర్యంలోనే అద్దంకి, మేదరమెట్లలో సంతలు నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అప్పుడు మాత్రమే ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సవ్యంగా జరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

అద్దంకిటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కట్టారామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సోమవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం సేవలను అధ్యాపకులు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వి.మోహన రావు, డాక్టర్ షర్మిలా రాణి, ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ చిలకా అనితతో పాటు ఇతర అధ్యాపకులు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

బల్లికురవ : బల్లికురవ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం రోటరీ క్లబ్ అఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అఫ్ మార్టూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, టీవీ ఆర్టిస్ట్ డి.మహేంద్ర, పాఠశాల ప్రధానోపధ్యాయిని కోమలి, నజీమ్, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు సుకన్య, మల్లేశ్వరి, సీహెచ్ రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరికి ఘన స్వాగతం

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : న్యూజిలాండ్ పర్యటన ముగించుకొని వచ్చిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సోమవారం ఉదయం విజయవాడలో టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. విజయవాడలోని ఏలూరి నివాస గృహంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి, స్వాగతం పలికారు. అనంతరం మండలంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మార్టూరు పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్దన్, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

అక్కయ్య మృతి పార్టీకి తీరని లోటు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


అక్కయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు(పర్చూరు) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యార్లగడ్డ అక్కయ్య చౌదరి మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం కారంచేడులోని అక్కయ్య చౌదరి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలపారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమల శ్రీహరి, మానం హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజారంజక బడ్జెట్ : ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందన్నారు. వైసీపీ అధికార దుర్వినియోగంతో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.1.35 లక్షల కోట్ల బకాయిలు పెట్టిందని చెప్పారు. వ్యవస్థలను గాడిన పెట్టే అనుభవం ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఉందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎన్నికల హామీల అమలుకు ఈబడ్జెట్ అద్దం పడుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వ బడ్జెట్ ఉందన్నారు. పంటల సాగులో అధునాతన టెక్నాలజీపై రైతులకు పోత్సాహం విత్తనాలు, సూక్ష్మ పోషక ఎరువులు సబ్సీడీలపై ఇస్తున్నట్లు తెలిపారు.

సీఎం చేతులమీదుగా అవార్డునందుకున్న హెచ్‌ఎం

అద్దంకిటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయుల అవార్డుల కార్యక్రమం సోమవారం విజయవాడలో జరిగింది. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని చక్రాయపాలెం జిల్లా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, స్నేహితులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.


హెచ్‌ఎం శ్రీనివాసరావుకు అవార్డును అందిస్తున్న సీఎం చంద్రబాబు

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అద్దంకి పట్టణంలోని పాత శివాలయం, వేయి స్తంభాల గుడి, కమఠేశ్వరాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.


మణికేశ్వరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కాకతీయ కార్తీక వనభోజనాలు

వేటపాలెం(చీరాల) : మండల పరిధిలోని రామాపురంలో కాకతీయ సేవా సమితి వారి ఆధ్వర్యంలో కాకతీయ కార్తీక వనభోజనాల కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. కాకతీయ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, విశిష్ట అతిధిగా అడుసుమల్లి వెంకటసుబ్బయ్య హాజరయ్యారు. నిర్వాహక ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. ఆత్మీయ పలకరింపులు, కుశల ప్రశ్నలతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం కార్యక్రమం సాగింది.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రతినిధులు

ఆహార నియమాలపై దృష్టి సారించాలి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోనే చదువుతో పాటు ఆహార నియమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-2 సుధారాణి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్‌లో అయోడిన్‌తో ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఐటీసీ, ఐజీడీ వారు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆహార నియమాలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధారాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీగా మొయిన్ బాధ్యతలు



చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల డీఎస్పీగా మహ్మద్ మొయిన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చీరాల ప్రాం తంపై పట్టు ఉందన్నారు. నేర నియంత్రణకు అందరూ సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు తనవంతు కృషి చేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు.

నిరుద్యోగుల వివరాలపై సర్వే

బల్లికురవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నిరుద్యోగుల వివరాలను సేకరించాలని ఎంపీడీవో కే కుసుమకుమారి కోరారు. సోమవారం బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్కిల్ సెన్సెస్ సర్వే కార్యక్రమంపై పంచాయతీ కార్యదరులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో చదువు పూర్తి అయి ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని సర్వే వివరాలను పూర్తిగా నివేదిస్తామని తెలిపారు. సమావేశంలో సర్వే మండల కోఆర్డినేటర్ ఉమమహేశ్వరరావు పాల్గొన్నారు.


రామస్థూపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న భక్తులు

రామస్థూపం నిర్మాణానికి భూమిపూజ

వేటపాలెం(చీరాల), నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : దత్తక్షేత్రం ప్రాంగణంలో సోమవారం రామ స్థూపం నిర్మాణానికి భక్తురాలు ఆదిలక్ష్మి చేతులమీదుగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ ప్రతినిధులు మాట్లాడుతూ భక్తులు రాసిన రామకోటి పుస్తకాలను నిక్షిప్తం చేసేందుకు ఈ రామ స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వహకులు ప్రమీలదేవి, ప్రత్తి వెంకటసుబ్బారావు, నున్నా శివప్రసాదరావు, మురళీకృష్ణ, వెంకటప్పయ్య, రాంబాబు, శ్రీనివాసరావు, రాజేశ్వరి, చంద్ర పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

బల్లికురవ. నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు పొగాకు సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, అపరాలను పండించాలని బాపట్ల వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త కామాక్షి పేర్కొన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ జరిగింది. ఈసందర్భంగా శాస్త్ర వేత్త మాట్లాడుతూ పొగాకు వలన ఆరోగ్యం కూడా పాడవుతుందని రైతులు మెట్ట పంటలను తక్కువ ఖర్చుతో సాగు చేసుకోవాలన్నారు. మార్టూరు వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు, హేవాక శాస్త్రవేత్త ఉష, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రత్నకుమారి, ఏవో కుమారి పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, పంటల సాగుపై రైతులకు అవసరమైన సలహాలను అందించారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త కామాక్షి

కారు ఢీకొని పలువురికి తీవ్ర గాయాలు

- గంట అయినా రాని అంబులెన్స్
- మరో శవం బండిలో హాస్పిటల్‌కు చేరిన బాధితులు


చికిత్స పొందుతున్న ప్రభంజని

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రక్త గాయాలతో అంబులెన్స్‌కు ఫోన్ చేసి గంటయినా వాహనం రాలేదు. దీంతో మానవత్వం చాటుకున్న మరో ప్రైవేటు అంబులెన్స్ వ్యక్తి శవం బండిలో ఉన్నా కూడా వీరిని కూడా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈఘటన సోమవారం పందిళ్లపల్లి రైలు గేటు సమీపంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆదినారాయణపురానికి చెందిన బలసాని ప్రభంజని, ఆంబోతుల లీల, సాయి మరికొందరు ఒంగోలులోని హాస్పిటల్లో ఉన్న బంధువులను పరామర్శించేందుకు ఆటోలో వెళుతున్నారు. అయితే పందిళ్లపల్లి రైలు గేటు సమీపానికి వెళ్లగానే ఎదురుగా వస్తున్న కారు వీరిని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో పై ముగ్గురితో పాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈక్రమంలో క్షతగాత్రులు 108కు ఫోన్ చేశారు. అయితే దాదాపుగా గంటైనా వాహనంరాలేదు. చివరకు అటుగా చీరాలకు ఓ మృతదేహంతో వస్తున్న ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ మానవత్వంతో వీరిని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు.

నరకం అనుభవించాం

ప్రమాదం కారణంగా గాయపడ్డాం. నా కాలికి గాయమైంది. మా బంధువు ప్రభంజనీ తల నుంచి రక్తస్రావమైంది. అందరం భయపడ్డాం. 108కు సమాచారమిచ్చినా గంటైనా రాలేదు. దీంతో ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి వెళ్లాం.

- సాయి, క్షతగాత్రుడు


హనుమంతరావు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న బలరాం

హనుమంతరావుకు నివాళి

కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బలరాం

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఆదివారం మార్టూరులో మృతిచెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అమర్నేని హనుమంతరావు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ కోసం హనుమంతరావు చేసిన సేవలను బలరాం గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తొండెపు ఆదినారాయణ, ఆళ్ల సాంబయ్య, ఎరువులు పురుగుమందులు విత్తనాలు అసోసియేషన్ అధ్యక్షుడు కిలారు లక్ష్మీ నారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

బల్లికురవ : మండలంలోని కె.రాజుపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చెరుకూరి వెంకయ్య రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కె.రాజుపాలెంలో చెరుకూరి వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అమరనేని హనుమంతురావు అనారోగ్యంతో మార్టురు గ్రామంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బలరాం పరామర్శించి హనుమంతురావు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో పలు గ్రామాలకు చెందిన వైసీపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గుండెపోటుతో పశువైద్యాధికారి మృతి



యద్దనపూడి (మార్టూరు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి పశువైద్యాధికారి బట్టా సురేష్‌బాబు (42) గుండెపోటు కారణంగా ఆదివారం సాయంత్రం గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని భార్య శారద మండలంలోని పూనూరు పశు వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. గత పదేళ్లుగా మార్టూరు మండలంలో ద్రోణాదుల, బొబ్బేపల్లి, బల్లికురవ మండలంలో సురేష్ బాబు పశువైద్యాధికారిగా పనిచేశారు. ప్రస్తుతం యద్దనపూడి పశువైద్యాధికారిగా పనిచేస్తూ ఆదివారం ఉదయం మార్టూరులోని స్వగృహంలో గుండెపోటుకు గురయ్యారు. దాంతో కుటుంబసభ్యులు అతనిని చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మరలా అతనిని మెరుగైన వైద్యం నిమిత్తం గుం టూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. అనంతరం మృతదేహాన్ని అతని స్వగ్రామమైన జాండ్రపేటలోని ఇంటికి తీసుకువెళ్లారు. అతనికి 13 ఏళ్ల కుమార్తె, రెండేళ్ల బాబు ఉన్నారు. సోమవారం ఉదయం జాండ్రపేటలో జరిగిన అంత్యక్రియలు కార్యక్రమానికి మండలంలోని పశువైద్యాధికారులు మాధవీలత, క్రాంతికిరణ్, మహేష్‌తో పాటు పలువురు సిబ్బంది వెళ్లి నివాళులర్పించారు. మార్టూరు, యద్దనపూడి మండలాల్లో పశుపోషకులకు, రైతులకు సుపరిచితులైన సురేష్‌బాబు మృతి కలిచివేసింది.

తొలగించిన వీవోఏలను కొనసాగించాలి

వెలుగు కార్యాలయం ముందు మహిళల ధర్నా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డ్వాక్రా మహిళలు

పంగులూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విధుల నుంచి తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ డ్వాక్రా మహిళలు, తొలగించబడిన వీఓఏలు కొందరు వెలుగు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు రాయిణి వినోద్‌బాబు మాట్లాడుతూ కారణం లేకుండా మండలంలో 18 మంది వీవోఏలను, మండల సమాఖ్య అధ్యక్షురాలిని తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పీ సింగారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీవోఏల సంఘ అధ్యక్షులు సావిత్రి, మండల సమాఖ్య ప్రతినిధి నాగలక్ష్మి, మండల కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా మహిళా కార్యదర్శి కృష్ణకుమారి, సీఐటీయూ ప్రతినిధి మల్లారెడ్డి, గోనుగుంట్ల అంజలి, ఆదుంసాహెబ్, ప్రజా కళాకారుడు నందవరపు జాన్, హేమలత, మీరాబి పాల్గొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి

తీవ్ర గాయలతో ఏరియా హాస్పిటల్‌కు తరలింపు

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డెలివరీ ఇవ్వడానికి వెళ్లిన బాయ్‌ను ముగ్గురు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరచారు. దీంతో బాధితుడిని కుటుంబ సభ్యులు ఏరియా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే స్థానిక పేరాలకు చెందిన నక్కల చిన్ను అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం స్వర్ణలో డెలివరీ ఇచ్చేందుకు ఓ ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో ఆర్డర్ చేసిన ప్రభుజీతో వివాదం తలెత్తిందింది. వెంటనే మరో ఇద్దరి యువకులతో కలిసి చిన్నును తీవ్రంగా చెక్కతో దాడిచేశారు. చెక్కకు ఉన్న మేకులు తలలో దిగబడ్డాయి. ఈక్రమంలో స్పృహ కోల్పోయిన బాధితుడిని స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

హాస్పిటల్ వైద్యులు చులకనగా చూస్తున్నారు

- ఆంజనేయులు, బాధితుడి తండ్రి

తీవ్రంగా గాయపడి బెడ్‌పై ఉన్న కొడుకుని చూడాలని మేము రోదిస్తున్నాము. గంట దాటినా చికిత్స ప్రారంభించలేదు. పైగా గదిలో ఎక్కువ మంది రోగులు కూడా లేరు. అయినా కూడా మా బిడ్డను చూడడానికి అవకాశం కల్పించలేదు. వేడుకున్నా పట్టించుకోలేదు. చాలా చులకనగా చూస్తున్నారు. అధికారులు హాస్పిటల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కార్మికులు సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం ఉంటుందని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 విద్యుత్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు అన్నారు. సోమవారం బాపనమ్మ కల్యాణ మండపంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈక్రమంలో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. చీరాల డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మనోహర్, శివకుమార్, రవిబాబు, సురేష్, శర్మ, సంజీవరావు, ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కమిటీ